కడప-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
ప్రభాత వార్త
మంగళవారం 13 జనవరి 2026

## ప్రపంచ వృక్ష ప్రేమికుడు ముత్తు సెల్వన్ కు ప్రశంసలు.

**తంబళ్లపల్లె జనవరి 12 ప్రభాతవార్త ః**



పర్యావరణ కాలుష్యం నివారణ కోసం ఓ యువకుడు ప్రపంచ యాత్రకు శ్రీకారం చుట్టి సోమవారం తంబళ్లపల్లె లో ప్రవేశించాడు. తమిళనాడుకు చెందిన ముత్తు సెల్వన్ 2021 పర్యావరణ పరిరక్షణ తో మొక్కలు పెంచాలని 11, 11,111 మొక్కలు నాటే లక్ష్యంతో సమాజ చైతన్యం కోసం జాతీయ జెండాతో సైకిల్ పై ప్రపంచ యాత్రకు శ్రీకారం చుట్టాడు. ఈ యాత్ర 2028లో ముగించి దేశ ప్రధానిని కలవనున్నట్లు ముత్తు సెల్వం తెలిపారు. భవిష్యత్తులో ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచి పర్యావరణానికి సహకరించాలని విస్తృత ప్రచారంలో భాగంగా ఆయన ప్రపంచ యాత్రలో భాగంగా ఇప్పటికే బర్మా, బంగ్లాదేశ్, నేపాల్ దేశాలు యాత్ర ముగించుకొని ఇండియా లోని 23 రాష్ట్రాలు 44 కిలోమీటర్లు 10483 రోజులు చుట్టి 580 జిల్లాల మీదుగా పర్యావరణం లో భాగంగా మొక్కలు పెంచాలని పాఠశాలలు, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించుకుంటూ అలుపెరగని సాహస యాత్ర కొనసాగిస్తున్నాడు. ఈ సందర్భంగా తంబళ్లపల్లెలో స్థానిక ప్రజలు, విద్యార్థులు ఆయనకు ఘన స్వాగతం పలికి ప్రత్యేకంగా అభినందించారు. ముత్తు సెల్వం సైకిల్ యాత్ర దిగ్విజయంగా కొనసాగాలని ఆకాంక్షించి సాగనంపారు.

## కడప జేసిగా నిధి మీనా

### అన్నమయ్య జెసిగా రాఘవేంద్ర శర్మ

**రాజంపేట,జనవరి12 ప్రభాతవార్త**





కడప ,అన్నమయ్య జిల్లాల జాయింట్ కలెక్టర్లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కడప జాయింట్ కలెక్టర్ అతిథి సింగ్ మెటర్నిటీ లీవ్‌పై వెళ్లారు. ఆమె స్థానంలో నిధి మీనాను ఇక్కడకు బదిలీ చేశారు. నిధి మీనా కడప ఎస్పీ విశ్వనాథ్ సతీమణి. మరోవైపు అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్‌ను చిత్తూరు జేసీగా బదిలీ చేశారు. అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్‌గా అనంతపురం జిల్లాలో జెసి రాఘవేంద్ర శర్మను నియమించారు. నందలూరు మండలానికి చెందిన ఐఏఎస్ అధికారిని విద్యాధరిని ఆర్థిక రాజధాని వైజాగ్ జాయింట్ కలెక్టర్గా నియమించారు.

## ఇండియా క్రీడాకారులను సన్మానించిన మంత్రి



**వేంపల్లె జనవరి 12 (ప్రభాతవార్త)**

నేపాల్ వేదికగా గత డిసెంబర్ నెలలో నిర్వహించిన సౌత్ ఏషియన్ గోల్ షాట్ బాల్ ఛాంపియన్‌షిప్ లో భారత జట్టు ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం గెలుచుకుని దేశానికి గర్వకారణంగా నిలిచింది. ఈ విజేతలైన భారత జట్టులో కడప జిల్లాకు చెందిన రాచవీటి తేజేంద్ర, తిరుపతి జిల్లాకు చెందిన రెడ్డిచర్ల దేవి ప్రియ పాల్గొని అద్భుత ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తన రాయచోటిలోని పార్టీ ఆఫీసులో క్రీడాకారులను మరియు ఇండియా జనరల్ సెక్రటరీ రాజేంద్ర ప్రసాద్ , ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి మనోహరెడ్డి , తిరుపతి జిల్లా కార్యదర్శి మురళి , రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాల జబీబుల్లా మొదలగు అసోసియేషన్ వారిని ఆత్మీయంగా ఆహ్వానించి సన్మానించారు. అనంతరం మంత్రి క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ శ్రీలంక, థాయిలాండ్, మల్దీస్, పాకిస్తాన్, బంగ్లాదేశ్, నేపాల్ దేశాల జట్లతో పోటీపడి విజయం సాధించడం అత్యంత గర్వకారణమని, ఈ విజయంతో భారతదేశానికి అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు వచ్చిందని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని క్రీడాకారులకు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు.

# గండికోటలో సందర్శకుల సందడి







**జమ్మలమడుగు, జనవరి 12, ప్రభాతవార్త**

గండికోట ఉత్సవాలలో భాగంగా రెండవ రోజు సోమవారం వివిధ రాష్ట్రాల నుంచి వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన సందర్శకులు, పర్యటకుల సాంస్కృతిక క్రీడా పోటీలలో భాగస్వామ్యంతో గండికోట పర్యాటక క్షేత్రంలో పండుగ వాతావరణం నెలకొంది. ఒకవైపు రకరకాల సంప్రదాయ, విభిన్న రుచులతో పర్యాటకులకు నోరూరిస్తున్న ఫుడ్ స్టాళ్లు, మరోవైపు.. సందర్శకుల మనసులను కట్టిపడేస్తున్న జిల్లా సాంస్కృతిక కళావైభవానికి దర్పణంగా హస్తకళలు, చేనేత వస్త్ర ప్రదర్శనలు, విక్రయశాలలు దర్శనమిస్తున్నాయి. గండికోట ఘన చరిత్రను తెలిపే గైడెడ్ హెరిటేజ్ వాక్, అడ్వెంచర్ యాక్టివిటీస్ లో భాగంగా యువతను ఆకర్షిస్తున్న హెలిరైడ్, పారామోటార్ గ్లైడింగ్ కార్యక్రమాలను నిర్వహించారు. వేర్వేరు ఉత్సవ కార్యక్రమాల వేదికల వద్ద వేడుకగా చూపరులను ఆకట్టుకుంటున్న వ్యాలీబాల్, టగ్ ఆఫ్ వార్, కబడ్డీ.. వంటి గ్రామీణ క్రీడలతో పాటు కవిత్వం, కథలు చెప్పడం, ఫోటోగ్రఫీ, స్కెచింగ్, పెయింటింగ్, వి.లాగింగ్, రాయలసీమ వంటల సృజనాత్మక పోటీలు సందర్శకులను అలరించాయి. ఉత్సవాల ప్రారంభ రోజు మొదటి రోజు కావడంతో ఆసక్తిగా ఏర్పాట్లను పరిశీలిస్తూ అన్ని ప్రాంతాల్లో సందర్శకులు కలియతిరిగారు. సందర్శకులను విజయనగర సామ్రాజ్య వైభవాన్ని గుర్తు చేస్తూ మత సామరస్యానికి ప్రతీకగా, గండికోట చరిత్రకు సజీవ ఆనవాళ్లుగా సాక్షాత్కరిస్తున్న కోట ప్రాంగణంలోని శ్రీ మాదవరాయ స్వామి గుడి, శ్రీ రంగనాథస్వామి. గుడి, జుమ్మా మసీదు కట్టడాలు దర్శనమిచ్చాయి. ఈ సందర్భంగా ఉత్సవాలకు హాజరవుతున్న అశేష పర్యాటక, సందర్శకులకు ఎలాంటి వసతుల కొరత లేకుండా అన్ని రకాల ఏర్పాట్లను అధికారులు ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరికి పూర్తిస్థాయి భద్రతను కల్పిస్తూ.. ప్రశాంత, స్వేచ్ఛా వాతావరణంలో ఉత్సవాల నిర్వహణకు జిల్లా పోలీసు యంత్రాంగం సహకరించింది.

### అందరికీ ఆకట్టుకుంటున్న "పారా మోటరింగ్"..

విహంగ్ అడ్వెంచర్ ఏజెన్సీ ద్వారా నడుపుతున్న పారా మోటరింగ్ విన్యాస కార్యక్రమం చూపరులను విశేషంగా ఆకట్టుకుంటోంది. కేవలం రూ. 2 వేలు మాత్రమే చార్జీ వసూలు చేస్తూ పర్యాటకులకు ముఖ్యంగా యువతను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ సందర్భంగా నిర్వాహకుడు సుధాకర్ మాట్లాడుతూ.. గత మూడేళ్ళుగా గండికోట ఉత్సవాల్లో విహంగ్ సంస్థను నిర్వహిస్తూ రాష్ట్రంలోని అన్ని పర్యాటక కేంద్రాల్లో.. ఈ సాహస క్రీడలను నిర్వహిస్తున్నాం. ప్రస్తుతం గండికోట 2026 ఉత్సవాల్లో సందర్శకుల నుండి విశేష స్పందన లభిస్తుందన్నారు.

### కళా, సాహితీ, సాంస్కృతిక పోటీలకు స్పందన

గండికోట పర్యాటక ఉత్సవాల్లో భాగంగా జిల్లా సాంస్కృతిక పర్యటక శాఖ నిర్వహించిన కవితలు సాహితీ కథా రచన పోటీలు పర్యాటకులను కళ అభిమానులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా.. చిత్రలేఖన, పెన్సిల్ స్కెచ్ ఆర్ట్ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన జమ్మలమడుగుకు చెందిన కల్యాణ వెంకటేష్.. మతసామరస్యానికి ప్రతీక అయిన గండికోటలో మాధవరాయ, రంగనాథస్వామి అలయాలతో పాటు జుమ్మా మసీదు చిత్రాలతో చారిత్రక వైభవాన్ని తన చిత్రలేఖనం ద్వారా చూపించారు.

### ఫుడ్ స్టాళ్లు చాలా శుచిగా, రుచిగా ఉన్నాయి

గండికోట ఉత్సవాల్లో భాగంగా.. మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాళ్లు అత్యంత రుచికరంగా, రుచికరంగా నిర్వహించడం జరుగుతోంది. కడపకు చెందిన తిరులమలేష్ మాట్లాడుతూ.. గండికోట ఉత్సవాల్లో జిల్లా యంత్రాంగం అన్ని వసతులను చాలా చక్కగా ఏర్పాటు చేశారు. అన్ని భద్రతా ఏర్పాట్లను, శానిటేషన్ కార్యక్రమాలను చాలా బాగా నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా ఇక్కడ మెప్మా ఎస్.హెచ్.జి. మహిళలు, ఇతర గ్రామీణ వంట నిర్వాహకులు ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాళ్లు శుచిగా ఉన్నాయి. అత సరసమైన ధరలకు ఆరోగ్యకరమైన రుచికరమైన వివిధ రకాల వంటకాలను అందిస్తున్నారు. నిన్నటి నుండి చాలా మంది సందర్శకులు వంటకాలను మెచ్చుకుంటున్నారు. వ్యాపారులు కూడా సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని తెలుపుతున్నారు.

### ఆకట్టుకుంటున్న సంప్రదాయ కళలు, చేతివృత్తి ఉత్పత్తులు

గండికోట ఉత్సవాల్లో భాగంగా.. మూడు రోజుల పాటు జరిగే పండుగ వాతావరణంలో డిఆర్డీఏ, మెప్మా మహిళా సంఘాలు, ఇతర గ్రామీణ వ్యాపారులు ఏర్పాటు చేసిన హస్తకళలు, చేనేత వస్త్రాల ప్రదర్శన, విక్రయ శాలలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఉత్సవాల్లో జిల్లా యంత్రాంగం స్టాళ్ల ఏర్పాటుకు కల్పించిన సదుపాయాలు వసతులు సంతృప్తికరంగా ఉన్నాయంటూ పలువురు మహిళలు వారి అభిప్రాయాలను వెలిబుచ్చారు.







## హార్సిలీ హిల్స్‌లో తప్పిన పెను ప్రమాదం

### లోయలో పడి విద్యార్థికి తీవ్ర గాయాలు

**మదనపల్లెక్రైమ్, జనవరి 12 ప్రభాతవార్త.**

అన్నమయ్య జిల్లా బి. కొత్తకోట మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీ హిల్స్‌లో తృటిలో ఒక పెద్ద ప్రమాదం తప్పింది. సరదాగా గడపడానికి వెళ్ళిన ఒక యువకుడు కాలుజారి లోయలో పడిపోయిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. పలమనేరుకు చెందిన పురుషోత్తం, తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీలో బిటెక్ మూడవ సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం ఉదయం తన స్నేహితులతో కలిసి హార్సిలీ హిల్స్ సందర్శనకు వచ్చాడు. ఈ క్రమంలో వ్యూ పాయింట్ వద్ద ఉన్న గాలి బండ ప్రాంతంలో స్నేహితులతో కలిసి ఫోటోలు తీసుకుంటుండగా, అకస్మాత్తుగా కాలుజారి లోయలోకి పడిపోయాడు. ఆ సమయంలో కొండపై దట్టమైన పొగమంచు ఉండటంతో పురుషోత్తం ఎక్కడ పడ్డాడో గుర్తించడం స్నేహితులకు కష్టతరమైంది. చాలా సేపు వెతికిన తర్వాత, లోయలోని చెట్ల పొదల్లో తీవ్ర గాయాలతో ఉన్న అతడిని గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా, బి. కొత్తకోట సి.ఐ గోపాల్ రెడ్డి, తమ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులు, స్థానికులు కలిసి లోయలోకి దిగి క్లిష్ట పరిస్థితుల్లో పురుషోత్తంను బయటకు తీశారు. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం మదనపల్లె ఆసుపత్రికి తరలించారు. చికిత్సలు చేసిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండడంతో వేలూరు సీఎం సి ఆసుపత్రికి తరలించారు. పర్యాటకులు వ్యూ పాయింట్ల వద్ద ఫోటోలు, సెల్ఫీలు తీసుకునేటప్పుడు అజాగ్రత్తగా ఉండవద్దని, ముఖ్యంగా మంచు కురిసే సమయంలో రాళ్లు జారుడుగా ఉంటాయని పోలీసులు హెచ్చరించారు. పురుషోత్తం లోయలో పడినా ప్రాణాపాయం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

## కోడి పందేలు చట్టరీత్యా నేరం

### మదనపల్లిలో అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించిన జేసీ, ఎస్పీ

**మదనపల్లె క్రైమ్, జనవరి 12 ప్రభాతవార్త.**



సంక్రాంతి పండుగ వేళ జిల్లాలో కోడి పందేలను పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం నడుం బిగించింది. కోడి పందేల నిషేధం, వాటి వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రూపొందించిన ప్రత్యేక పోస్టర్‌ను జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, మదనపల్లి సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి సోమవారం మదనపల్లిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ మాట్లాడుతూ.. కోడి పందేలు నిర్వహించడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. పందేల వల్ల సామాన్యులు ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా, గ్రామాల్లో ముఠా తగాదాలు పెరిగి శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు ఈ అక్రమ కార్యకలాపాలకు దూరంగా ఉండి, చట్టాన్ని గౌరవించాలని కోరారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించేందుకు మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మాట్లాడుతూ కోడి పందేలు నిర్వహించినా, బెట్టింగ్‌లకు పాల్పడినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లావ్యాప్తంగా పోలీస్ శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసిందని, అక్రమ పందెం బరులపై దాడులు నిర్వహిస్తామని తెలిపారు. ప్రజలు ఈ అక్రమ పద్ధతులకు సహకరించకుండా పోలీసులకు సమాచారం అందించాలని పిలుపునిచ్చారు.

## ప్రభుత్వ సేవలు ప్రజలకు అందించడమే లక్ష్యం

### జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్

**మదనపల్లె, జనవరి 12 ప్రభాతవార్త :**

ప్రజలకు ప్రభుత్వ సేవలు, పారదర్శకంగా అందించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ తెలిపారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా చేపడుతున్న వివిధ ప్రభుత్వ కారక్రమాల అమలపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మదనపల్లె కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్, జిల్లా ఎస్పి ధీరజ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వ సేవలు వేగంగా, పారదర్శకంగా అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, నిర్ణయిత లక్ష్యాల సాధనలో నిర్లక్ష్యం ఉండరాదని ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయిలో అమలవుతున్న కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి బలోపేతం చేయాలన్నారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ అధికారులనుద్దేశించి మాట్లాడుతూ వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి ఆదేశించిన విధంగా ప్రజాసంక్షేమమే లక్ష్యంగా చేపడుతున్న ప్రతి కార్యక్రమం సకాలంలో పూర్తి కావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రధానంగా ఆర్‌టిజిఎస్ పనితీరు, పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ వేగవంతం చేయాలన్నారు. తప్పులు లేకుండా రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

## శిల్పారామంలో మూడు రోజుల సంక్రాంతి సంబరాలు

**పులివెందుల, జనవరి 12 , ప్రభాత వార్త :**



పులివెందుల పట్టణంలో నీ వై.యస్.ఆర్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లోను, శిల్పారామం ప్రాంగణంలోను సంక్రాంతి పండుగను పురస్కరించుకొని జనవరి 14 నుంచి 16 వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఘనంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్లు శిల్పారామం పరిపాలనాధికారీ స్వామినాయుడు తెలిపారు. జనవరి 14వ తేదీ బుధవారం (భోగి) సాయంత్రం భోగి మంటలతో సంబరాలు ప్రారంభమవుతాయి. అదే రోజు సాయంత్రం 5.30 గంటల నుంచి చిన్నారులచే శాస్త్రీయ, జానపద నృత్య ప్రదర్శనలు నిర్వహించనున్నా రు. విజయవాడ ఎక్సలెంట్ ఇన్స్టిట్యూట్‌కు చెందిన నాగార్జున ఇంగ్లీష్ మీడియం స్కూల్ (పులివెందుల) చిన్నారులు, శ్రీమతి గీత ఆధ్వర్యంలో తమ నృత్య ప్రదర్శనలతో అలరించనున్నారు. జనవరి 15వ తేదీ గురువారం (మకర సంక్రాంతి) భవాణి కృష్ణ క్లాసికల్ డ్యాన్స్ అకాడమీ మాస్టర్ భవాణి నేతృత్వంలో చిన్నారులచే శాస్త్రీయ, జానపద నృత్యాలు ప్రదర్శించనున్నారు. అదే విధంగా గాలిపటాల పండుగ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. జనవరి 16వ తేదీ శుక్రవారం (కనుమ) రోజున శ్రీరాజ కళానిలయం మరియు యువరాజ డ్యాన్సింగ్ స్కూల్ పులివెందుల మాస్టర్ రాజా, యువ కిశోర్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి. అలాగే యస్.కె. ఫిల్మీ స్టూడియో మరియు బ్లో డ్యాన్స్ స్టూడియో మాస్టర్ శర్వాన్ కుమార్ వారి చిన్నారుల ప్రదర్శనలు, "జగన్నాథం" సినిమా ట్రైలర్ లాంచ్ విత్ టీమ్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ప్రతి రోజు సాయంత్రం 6.00 గంటల నుంచి రాత్రి 8.00 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రజలు కుటుంబ సమేతంగా పాల్గొని ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని శిల్పారామం పులివెందుల పరిపాల నాధికారి, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధిలో దోపిడిని అరికట్టడానికే విబి జి రామ్‌జి

### బిజెపి జిల్లా అధ్యక్షులు సాయిలోకేష్

**మదనపల్లె, జనవరి 12 ప్రభాతవార్త :**



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు సాయిలోకేష్

గతంలో ఉపాధిహామీ పథకంలో జరుగుతున్న ప్రజాధనం దుర్వినియోగాన్ని అరికట్టడానికే ప్రధానమంత్రి నరేంద్రమోడి విబి జి రామ్‌జిని ప్రవేశపెట్టారని బిజెపి జిల్లా అధ్యక్షులు సాయిలోకేష్ తెలిపారు. సోమవారం పట్టణంలోని బిజెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో గ్రామీణ ఉపాధిహామీ పథకంలో కోట్లాది రుపాయల ప్రజాధనం దుర్వినియోగం అయ్యిందన్నారు. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా కేంద్ర ప్రభుత్వం వికసత్ భారత్ గ్యారెంటి ఫర్ రోజార్(విబి జి రామ్‌జి)ని ప్రవేశపెట్టారన్నారు. ఈవిధానం ద్వారా నిరుపేదలకు లబ్ది చేకూరుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రతి పేదవాడు వలస పోకుండా ఈ పథకం ద్వారా ఉపాధి పొందవచ్చునన్నారు. గ్రామసభలు నిర్వహించి ఈ పథకం ద్వారా రైతు కూలీలు కూడా ఉపాధి పొందవచ్చునన్నారు. గతంలో కూలీలకు ఉపాధి పథకంలో నూరు రోజులు పనిదానాలు ఉంటే ప్రస్తుతం 125రోజులకు పెంచడం జరిగిందన్నారు. అధనంగా మరో 60రోజులు వ్యవసాయ రంగంలో కూడా రబీ, ఖరీఫ్ సీజన్‌లలో ఈ పథకం కింద పనులు చేసుకునే వసతి కల్పించిందన్నారు. 11ఏళ్ళల్లో కేంద్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. కొత్తగా ప్రవేశపెట్టిన పథకం ద్వారా నేరుగా కూలీలే లబ్ది పొందుతారన్నారు. ఈకార్యక్రమంలో బిజెపి జాతీయ నాయకులు చల్లపల్లె నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి పులి నరేంద్రరెడ్డి, ఎల్లంపల్లి ప్రశాంత్, ఓసూరి కిరణ్, బర్నేపల్లి రవికుమార్, రాందాస్, పిల్లస్వామినాయక్, క్రిష్ణమూర్తి, ఆనందకుమార్ తదితరులు పాల్గొన్నారు. తొలుత కలెక్టరేట్ వద్ద పిజిఆర్ఎస్ కార్యక్రమంలో బిజెపి నాయకులు పాల్గొని ప్రజాసమస్యలను అడిగి తెలుసుకొన్నారు.

## తహసిల్దార్ కార్యాలయంలో వినతుల స్వీకరణ

**దువ్వూరు, జనవరి 12, ప్రభాతవార్త:**



స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా ప్రజల నుండి వివిధ రకాల వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజలు వివిధ రకాల సమస్యలపై తమ దరఖాస్తులను తాసిల్దార్ కు సంబంధిత అధికారులకు అందజేశారు. ముఖ్యంగా రీ సర్వేలో తప్పులు, కొత్తగా అందజేసిన పాస్ పుస్తకాలలో అక్కడక్కడ పొరపాట్లు ఉన్నందున సరిచేయాలని కోరారు. తాసిల్దార్ సంజీవరెడ్డి, ఎంపీడీవో సుబ్బారెడ్డి లు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే వినతి పత్రాలపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలన్నారు. ఈ విషయంలో అధికారుల ఒత్తిడి ఉందని, సమస్యలు పరిష్కారం కాకపోతే ఎందుకు కాలేదో తెలియజేయాలన్నారు. ఇకపై చర్యలు ఉంటాయని అందువల్ల సిబ్బంది జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఏపీఓ లక్ష్మీ నారాయణ, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ శివకుమార్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## మా ఇబ్బందులు తొలగించరా

**పోరుమామిళ్ల రూరల్, జనవరి 12 ప్రభాతవార్త:**

పోరుమామిళ్ల నుండి రంపాడు రోడ్డు మీదుగా 15 గ్రామాలకు రాకపోకలు జరుగుతుండగా సిమెంట్ రోడ్డు వేసి అనేక రకాలుగా ప్రజలకు ఇబ్బందులు కాంట్రాక్టర్ చేస్తున్నారని ప్రజలు ఒక ప్రకటనలో వాపోయారు. ఇవేమీ పట్టనట్టు అధికారులు చోద్యం చూస్తున్నారన్నారు. సిమెంట్ రోడ్డు వేసి నెలరోజులు కావస్తున్న మన్ను తొలగించి రాకుపోకులకు అంతరాయం లేకుండా ప్రజలకు ఇబ్బంది లేకుండా చేయవలసిన కాంట్రాక్టర్ నిరక్ష్యంగా వ్యవహరిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రంపాడు రోడ్డు రాకపోకలు కొనసాగించాలని కోరారు.

## పేదల సంక్షేమమే తమ ధ్యేయం

### ప్రజాదర్బార్‌లో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

**చిన్నమండెం, జనవరి 12 ప్రబాతవార్త:**



రాబోయే 3, సంవత్సరాలలో రాయచోటి నియోజకవర్గం రూపురేఖలు మార్చి అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తామని రాష్ట్ర రవాణా యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి బోరెడ్డిగారిపల్లె లోని తమ నివాసం నందు ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే 3, సంవత్సరాలలో రాయచోటి నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు చేపట్టి రాయచోటి నియోజకవర్గం రూపురేఖలు మార్చడం జరుగుతుందన్నారు. గతంలో రాయచోటి నియోజకవర్గం ఎంతో వెనుకబడి ఉండేదని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దాదాపు రెండు సంవత్సరాల కాలంలోనే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. రాయచోటి నియోజకవర్గం రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు తమ వంతు బాధ్యతగా పనిచేస్తానన్నారు. గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాయచోటి నియోజకవర్గం అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపడం జరుగుతోందని ఇందుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు ప్రతి ఒక్కరు తమకు సహకరించాలన్నారు. తాను శాసనసభ్యునిగా ఎన్నికైనప్పటినుంచి రాయచోటి నియోజకవర్గం అభివృద్ధి తమ ధ్యేయంగా ముందుకు వెళుతున్నానని నిరంతరం ప్రజలతోనే మమేకమై ఉంటానన్నారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన ప్రజల అర్జీలు స్వీకరించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఫోన్ చేసి అక్కడికక్కడే బాధితుల సమస్యలు పరిష్కరించడం జరిగింది. దీంతో అర్జీదారులు మంత్రివర్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ఎలక్ట్రికల్ ఆటోల ద్వారా పారిశుద్ధ్య నిర్వహణ

### జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్

మదనపల్లె, జనవరి 12 ప్రభాతవార్త :



జెండా ఊపి ఆటోలను ప్రారంభిస్తున్న దృశ్యం

స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ ద్వారా మంజూరైన 8 ఎలక్ట్రికల్ ఆటోలను జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ పంపిణీ చేశారు. సోమవారం మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో ఈ ఆటోలను పంపిణీ చేయడం జరిగింది. జాయింట్ కలెక్టర్‌తో పాటు జిల్లా ఎస్పి ధీరజ్, సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి సంయుక్తంగా ఎలక్ట్రికల్ ఆటోలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఒకొక్క ఆటో విలువ రూ.3.75లక్షలతో గ్రామీణ ప్రాంతాల్లో డోర్‌టు డోర్ చెత్త సేకరణ, చెత్త తరలింపు, శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణ కోసం వినియోగించనున్నట్లు తెలిపారు. గ్రామీణ పారిశుద్ధ్య వ్యవస్థ బలోపేతం కావాలంటే రోజువారి చెత్త సేకరణ తప్పనిసరి అన్నారు. ఈఆటోల వినియోగం ద్వారా గ్రామాల్లో పారిశుద్ధ్య పరిస్థితులు గణనీయంగా మెరుగుపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయితీ అధికారి రాధమ్మ, పంచాయితీ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అల్లసాని పెద్దన జీవితంపై కవి సమ్మేళనం

### జిల్లా రచయితల సంఘం గౌరవ అధ్యక్షులు

మదనపల్లె, జనవరి 12 ప్రభాతవార్త :



సన్మానిస్తున్న దృశ్యం

అల్లసాని పెద్దన జీవితం-సాహిత్యం అనే అంశంపై శతాదిక కవిసమ్మేళనం నిర్వహించినట్లు అన్నమయ్య జిల్లా రచయితల సంఘం గౌరవ అధ్యక్షులు, సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్.మునిగోపాలక్రిష్ణ తెలిపారు. సోమవారం వైఎస్ఆర్ కడపజిల్లా ఎర్రగుంట్ల మండలంలోని పెద్దనపాడులో అలసాని పెద్దన విగ్రహావిష్కరణ ఘనంగా జరిగింది. ఈకార్యక్రమానికి ఆచార్యులు మల్లికార్జున రెడ్డి ఆహ్వానం మేరకు ముఖ్య అతిధులుగా డాక్టర్ ఎన్.మునిగోపాలక్రిష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా అలసాని పెద్దన్న ఆంధ్రకవితా పితామహుడు, అష్టదిగ్గజాల గొప్పతనం అనే కవితను చదివి వినిపించారు. అనంతరం మునిగోపాలక్రిష్ణను శాలువతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈకార్యక్రమంలో అల్లసాని పెద్దన వ్యాససంపటి పుస్తకాన్ని ఆవిష్కరించారు.

## ఘనంగా స్వామి వివేకానంద జయంతి

మదనపల్లె, జనవరి 12 ప్రభాతవార్త :



నివాళులర్పిస్తున్న దృశ్యం

పట్టణంలోని సొసైటికాలనీ పార్కు వద్ద స్వామి వివేకానంద విగ్రహం వద్ద సోమవారం బిజెపి, టిడిపి నాయకులు స్వామి వివేకానంద జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా 30మంది యువతీ, యువకులు రక్తదానంచేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఓబిసి మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి ఆనంద్, నాయకులు వరదారెడ్డి, కిరణ్‌కుమార్, నారదరెడ్డి, శ్రీకాంత్, శ్రీనివాసులు, వెంకటరాజు, తెలుగుదేశం పార్టీ నాయకులు భవానిప్రసాద్, భాస్కరాచారి తదితరులు పాల్గొన్నారు.

## రీ సర్వేతో రైతులకు ఓరిగిందేమి లేదు

### బివైఎస్ నాయకులు పునిత్

మదనపల్లె, జనవరి 12 ప్రభాతవార్త :



ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

భూ రీసర్వే సమస్యలను గాలికి వదిలేసి పట్టాదారు పాసుపుస్తకాలపై కేవలం ఫోటో వార్పుకే రెవెన్యూ యంత్రాంగం పరిమితం అయ్యారని బహజన యువసేన అధ్యక్షులు పునిత్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపి కలెక్టర్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా పునిత్ మాట్లాడుతూ గ్రామసభల పిజిఆర్ఎస్ ధరఖాస్తుల నిర్లక్ష్యం, గత ప్రభుత్వం రీసర్వే తప్పులను సరిదిద్దడానికి గ్రామసభలు నిర్వహించి తీసుకొన్న ధరఖాస్తులు అధికారులు కనీసం పరిగణలోకి తీసుకోలేదని ఆరోపించారు. వేలాదిమంది రైతులు భూ సమస్యలపై ఫిర్యాదు చేసినా ఒక్కసమస్య పరిష్కారం కాలేదన్నారు. గత ముఖ్యమంత్రి ఫోటోను తొలగింపుకే పట్టాదారు పాసుపుస్తకాలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం భూ రికార్డుల్లో ఎలాంటి తప్పులను సరిచేయలేదన్నారు. పాత తప్పుల యదావిధిగా పాసుపుస్తకాల్లో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జిలాని, శశికుమార్, వినయ్, రామాంజులు తదితరులు పాల్గొన్నారు.

## రీసర్వేను సంవర్ధవంతంగా చేపట్టాలి

చౌడేపల్లి, జనవరి 12 ప్రభాతవార్త



ప్రసంగిస్తున్న తహశీల్దార్ పార్వతి

మండల వ్యాప్తంగా జరుగుతున్న భూముల రీసర్వేను సంవర్ధవంతంగా పూర్తి చేయాలని తహశీల్దార్ పార్వతి అన్నారు. స్థానిక మండల పరిపాలనా భవనంలో మండలంలోని విఆర్వోలు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. రీసర్వేపై రైతులకు అవగాహన కల్పించి రికార్డులను నిసితంగా పరిశీలించారన్నారు. నిర్లక్ష్యం వహించకుండా ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. అనంతరం రీసర్వేపై పంచాయతీల వారీగా సమీక్షించారు. విఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

## కాశీవిశ్వేశ్వరస్వామికి సోమవారం పూజలు

### -విద్యుత్ రోడ్డు వసతిలేక భక్తుల ఇక్కట్లు

చౌడేపల్లి, జనవరి 12 ప్రభాతవార్త



చౌడేపల్లి పరిధిలోని చిన్నకొండామర్రి అగ్రహారం వద్దగల శ్రీవిశాలాక్షి సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. కార్తీకపౌర్ణమి సందర్బగా ఉదయాన్నే ఆలయంలో ప్రధానార్చకులచే అభిషేక ప్రియునికి పంచామృతాభిషేకం అనంతరం వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆలయ నిర్మాణదాత మనోహర్ ఆధ్వర్యంలో భక్తులకు పవిత్ర తీర్ధ ప్రసాదాలందించారు. కాగా దారి, విద్యుత్ సౌకర్యం లేక భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

## శునకాల జోరు వాహనదారుల బేజారు

చౌడేపల్లి, జనవరి 12 ప్రభాతవార్త



మండల కేంద్రమైన చౌడేపల్లిలో శునకాల జోరుతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయాన్నే పట్టణంలోని బస్టాండు, గోసలకురపల్లిరోడ్డు, బజారు వీధి, గాంధీవీధి తదితర ప్రాంతాల్లో కుక్కల సంచారం అధికంగా వుంది. ముఖ్యంగా వాహనదారులను శునకాలు ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. వాటి వెంటపడీ మరీ గాయాల పాలు చేస్తున్నాయి. గడచిన వారం రోజుల్లో దాదాపు 10మందికి పైగా శునకాల వల్ల వాహనదారులు కిందకు పడిపోయి క్షతగాత్రులయ్యారు. మరికొందరిపై దాడి చేయడంతో ఆసుపత్రి పాలవుతున్నారు. కుక్కల బెడద నుంచి రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

## పంచాయతీ భవనాలను పరిశీలించిన అధికారులు

దువ్వూరు, జనవరి 12, ప్రభాతవార్త:



మండల పరిధిలోని మాసనపల్లె, బుక్కాయి పల్లె, మూడిళ్ల పల్లె గ్రామాలలో నూతనంగా నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ భవనాలను పంచాయతీరాజ్ డిఈ మధుసూదన్ బాబు, ఏఈ సుబ్రహ్మణ్యం లు సోమవారం పరిశీలించారు. మూడు గ్రామాల్లో ఒక్కొక్క గ్రామ పంచాయతీ భవనానికి 32 లక్షల రూపాయల నిధులు కేటాయించారు. ఈ నిధులు గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా కేటాయించాలని డిఈ తెలిపారు. ఈ మూడు పంచాయతీ భవనాలను మార్చి నెల లోపల పూర్తి చేయవలసి ఉంటుందన్నారు. ప్రస్తుతానికి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. నాణ్యతా పరంగా పనులు చేయాలని ఆదేశించారు.

## మండల వాసుల సమస్యల కోసం కృషి

నిమ్మనపల్లె, జనవరి 12 ప్రభాతవార్త :

మండల వాసుల సమస్యల కోసం ఎల్లవేలలా కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన పార్టీ మండల అధ్యక్షులు బి.రాజన్న అన్నారు. సోమవారం నూతనంగా ఎంపికైన రాజన్న మాట్లాడుతూ పార్టీలకు, వర్గాలకు అతీతంగా మండల వాసుల సమస్యలకు కృషి చేస్తానని నాకు ఈ పదవికి కృషిచేసిన ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు, టిడిపి నాయకులకు, కార్యకర్తలకు అభినందనలు తెలిపారు.

## సంక్రాంతి క్రికెట్ సంబరాలకు ఘన ఆరంభం

పోరుమామిళ్ల రూరల్, జనవరి 12 ప్రభాతవార్త:



సంక్రాంతి పండుగ వేళ క్రీడా ఉత్సవాలకు నాంది పలుకుతూ సోమవారం పోరుమామిళ్ల పట్టణంలో నిర్వహించిన వర్కింగ్ జర్నలిస్టుల క్రికెట్ టోర్నమెంట్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ నియోజకవర్గ వైసిపి అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాథ రెడ్డి, పోరుమామిళ్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ హేమసుందర్ రావులు ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడల ద్వారా ఐక్యత, స్నేహభావం, ఆరోగ్యకరమైన పోటీభావం పెంపొందుతాయని, జర్నలిస్టుల ప్రతిభను క్రీడా వేదికపై ప్రదర్శించేలా ఏర్పాటు చేసిన ఈ టోర్నమెంట్ సంక్రాంతి సందడికి మరింత ఉత్సాహాన్ని జోడించాయని, సంక్రాంతి క్రికెట్ సంబరాలు విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు.

## పాస్ బుక్స్ పంపిణీ పారదర్శకంగా జరగాలి

కలసపాడు, జనవరి 12 ప్రభాతవార్త:



ప్రభుత్వం చేపట్టిన పాస్ బుక్స్ పంపిణీ కార్యక్రమం ఎలాంటి అవకతవకలు లేకుండా, పూర్తిగా పారదర్శకంగా, ప్రజలకు నిజంగా ఉపయోగపడే రీతిలో నిర్వహించాల్సిన అవసరం ఉందని ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ సెక్రటరీ పి.వి. ఐ. రాజు స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం కలసపాడు మండలం ఎమ్మార్వో మధురవాణిని కలిసి, పట్టాదార్ పాస్ బుక్స్ పంపిణీలో రైతులు, భూమి యజమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల హక్కులను కాపాడటమే ప్రభుత్వ బాధ్యత అని, భూమి హక్కులకు సంబంధించిన అంశాల్లో చిన్నపాటి నిరక్ష్యం కూడా పెద్ద సమస్యలకు దారి తీస్తుందని పి.వి ఐ రాజు అన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి, సందేహాలకు వెంటనే పరిష్కారం చూపితేనే ఈ కార్యక్రమం విజయవంతమవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో మధురవాణి స్పందిస్తూ, పట్టాదార్ పాస్ బుక్స్ పంపిణీ ప్రక్రియను నిబంధనల ప్రకారం, పారదర్శకంగా నిర్వహిస్తామని హామీ ఇచ్చారు.

## వివేకానందుడి జయంతి వేడుకలు

కలసపాడు, జనవరి 12 ప్రభాతవార్త:



జిల్లాలోని కాశినాయన మండలం ఓబుళాపురం గ్రామ సమీపాన సగిలేటి ఒడ్డున ఉన్న వివేకానంద సేవాశ్రమంలో సోమవారం పండగ వాతావరణం నెలకొంది. స్వామి వివేకానందుడి 164వ జయంతి సందర్భంగా ఆశ్రమంలో ఉన్న వివేకానందుడి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆశ్రమంలోని వృద్ధులు స్వామి విగ్రహానికి అత్యంత భక్తిశ్రద్ధలతో అలంకరించి నమస్కరించుకున్నారు. వివేకానంద ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ స్వామి ఇచ్చిన స్ఫూర్తితో సేవామార్గంలో నడుస్తూ ఈ ఆశ్రమాన్ని నిర్వహిస్తున్నామని, నాతో పాటు ఎంతోమంది యువత, పెద్దలు మా వెనక ఉండి నడిపిస్తున్నారని పేర్కొన్నారు. యువజన దినోత్సవం సందర్భంగా స్వచ్ఛందంగా సేవ చేస్తున్న పలువురు యువకులను జ్ఞాపిక, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పి. రమణారెడ్డి, కె. గురుమూర్తి, డి. వెంకట సుబ్బారెడ్డి, బి. కిషోర్ వినయ్ దాస్, చంద్రశేఖర్ ఆచారి, రమణమూర్తి, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులపై సమీక్ష

దువ్వూరు, జనవరి 12, ప్రభాతవార్త:



స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని సభా భవన్‌లో సోమవారం అభివృద్ధి, పన్ను వసూళ్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఎంపీడీవో సుబ్బారెడ్డి, ఈఓపిఆర్డి హరికృష్ణ లు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో మార్చి నిలాఖరులోగా 100 శాతం ఇంటి, నీటి పన్ను వసూళ్లను పూర్తి చేయాలన్నారు. ఈ విషయంపై ముమ్మరంగా ప్రజలతో చర్చించి వసూళ్లను వేగవంతం చేయాలన్నారు. అలాగే ప్రభుత్వం చేపట్టే వివిధ రకాల సర్వేలను పూర్తిచేయాలన్నారు. ఈనెల 17వ తేదీ నుండి స్వచ్ఛ రథం అనే కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, ఈ వాహనం ద్వారా ఇంట్లో ఉన్న పనికిరాని వస్తువులను తీసుకొని వారికి నిత్యవసర సరుకులు అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమం పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సమీక్షల పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## పెండ్లిమర్రి ఎస్సైగా తులసీ నాగప్రసాద్

పెండ్లిమర్రి, జనవరి 12, ప్రభాతవార్త:

పెండ్లిమర్రి ఎస్సైగా కడప తాలూకా నుంచి తులసీ నాగప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. మహిళలు, బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవన్నారు. రౌడీషీటర్లకు, చెడునడత కలవారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. వాహనాలకు రికార్డులు తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు.

## పెండ్లిమర్రి ఏపీఎంగా వెంకట సుబ్బమ్మ

పెండ్లిమర్రి, జనవరి 12, ప్రభాతవార్త:

మండలంలోని పెండ్లిమర్రి ఏపీఎంగా ప్రొద్దుటూరు నుంచి వెంకట సుబ్బమ్మ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సంఘాలను బలోపేతం చేస్తామన్నారు. మహిళలకు సకాలంలో లోన్లు అందిస్తామని వాటిని సకాలంలో చెల్లించాలన్నారు. గ్రామాల్లో వీఓలతో సమావేశం ఏర్పాటు చేసి గ్రామ సంఘాలను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు తదితరులు పాల్గొన్నారు.

# సాక్షిని బెదిరిస్తే నేరుగా ఎఫ్ఐఆర్ నమోదు చేయవచ్చు

### (కోర్టు ఫిర్యాదు అవసరం లేదు-సుప్రీం కోర్టు తీర్పు)

బద్వేలు లీగల్, జనవరి 12 ప్రభాతవార్త:

భారత శిక్షాస్మృతి సెక్షన్-195(ఎ) క్రింద సాక్షిని బెదిరించడం శిక్షార్హమైన నేరం అని సుప్రీం కోర్టు తీర్పును వెలువరించింది. కోర్టు నుండి అధికారిక ఫిర్యాదు కోసం వేచి ఉండకుండా నేరుగా ఎఫ్ఐఆర్ నమోదు చేసి ధర్యాప్తు చేయడానికి పోలీసులకు అధికారం ఇస్తుందని నొక్కి వక్కాణించింది. ఐపిసి సెక్షన్-195(ఎ) క్రింద సాక్షిని బెదిరించిన నేరానికి పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేరని, అటువంటి నేరాలను సిఆర్‌పిసిలోని సెక్షన్-195, 340 క్రింద సంబంధిత కోర్టు వ్రాతపూర్వక ఫిర్యాదు ద్వారా మాత్రమే ప్రాసిక్యూట్ చేయవచ్చని కేరళ హైకోర్టు ఇచ్చిన తీర్పును దేశ అత్యున్నత న్యాయ స్థాన న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ అలోక్ అరాధేలతో కూడిన ధర్మాసనం ప్రక్కన పెట్టింది. ఐపిసి సెక్షన్-195(ఎ) దీనిని ఉద్దేశ్యపూర్వకంగానే విభిన్నమైన నేరంగా గుర్తించిందని వివరిస్తూ బెదిరింపులకు గురైన సాక్షుల వాంగ్మూలాల ఆధారం చేసుకొని నేరుగా ఎఫ్ఐఆర్ నమోదు చేసే అధికారం పోలీసులకు ఉందని కూడా సుస్పష్టం చేసింది. "ఐపిసిలోని సెక్షన్-193, 194, 195 మరియు 196 క్రిందకు వచ్చే నేరాల కంటే భిన్నమైన నేరంగా గుర్తించేందుకు సెక్షన్-195(ఎ)ని తీసుకువచ్చారని, ఆ నేరాలకు సెక్షన్-195(1)(బి)(ఐ) సిఆర్‌పిసిలో పేర్కొన్నవారు మాత్రమే ఫిర్యాదు చేయాలి, అవన్నీ న్యాయ స్థానాలు శిక్షార్హమైనవిగా గుర్తించతగినవి కావు, అయితే ఐపిసి సెక్షన్-195(ఎ) క్రింద జరిగే నేరం శిక్షార్హమైనదిగా, ఒక వ్యక్తి ప్రతిష్టకు లేదా ప్రయోజనానికి లేదా ఆ వ్యక్తికి సంబంధించిన వ్యక్తులకు లేదా వారి ప్రతిష్టకు హాని కలిగించే బెదిరింపుతో తప్పుడు సాక్ష్యం చెప్పించేలా ప్రేరేపించడానికి సంబంధించినది." అని న్యాయ స్థానం అభిప్రాయపడింది. బెదిరింపునకు గురైన సాక్షి ఫిర్యాదు కోసం తొలుత న్యాయ స్థానాన్ని ఆశ్రయించాలనడం ఆచరణాత్మకం కాని అడ్డంకి అని నొక్కి వక్కాణించింది. పోలీసుల అధికారాన్ని పునరుద్ఘాటిస్తూ న్యాయ స్థానం ఇలా వ్యాఖ్యానించింది. "ఐపిసి సెక్షన్-195(ఎ) క్రింద జరిగే నేరం విచారణకు అర్హమైన నేరం అనేది కాదనలేని వాస్తవము, సిఆర్‌పిసి సెక్షన్-154 మరియు 156 క్రింద దానికి సంబంధించి చర్య తీసుకునే పోలీసుల అధికారాన్ని కాదనలేము, దీనిని విచారణకు అర్హమైన నేరంగా వర్గీకరించినందున సిఆర్‌పిసి సెక్షన్-154 క్రింద సంబంధిత పోలీసు అధికారికి అలాంటి నేరం జరిగినట్లు సమాచారం ఇవ్వడం ద్వారా క్రిమినల్ చట్టం క్రింద చర్యను ప్రారంభింపవచ్చు. మేజిస్ట్రేట్ ముందు ఫిర్యాదును అదనపు పరిష్కారంగా సిఆర్‌పిసి సెక్షన్-195(ఎ) అనుమతినిస్తుంది." అని వ్యాఖ్యానించింది. వివరాలలోకి వెళితే... ప్రతివాది తాను నిందితుడిగా వున్న ఓ హత్య కేసు విచారణలో సాక్షిని (అప్రూవర్‌గా మారిన వ్యక్తిని) బెదిరించడంపై ఐపిసి సెక్షన్-195(ఎ) క్రింద నేరానికి సంబంధించి ప్రతివాది, నిందితుడికి కేరళ హైకోర్టు బెయిల్ మంజూరు చేయడాన్ని వ్యతిరేకిస్తూ కేరళ రాష్ట్ర ప్రభుత్వం అప్పీలు దాఖలు చేసింది. ఐపిసి సెక్షన్-195(ఎ) పరిధి లోనికి వచ్చే నేరంపై ఎఫ్ఐఆర్ నమోదు చేసే అధికారం పోలీసులకు లేదని, ఆ నేరంపై ఫిర్యాదు చేయడానికి కోర్టుకు మాత్రమే అధికారం ఉందని ఈ సందర్భంగా హైకోర్టు పేర్కొనగా విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు ఐపిసి సెక్షన్-195(ఎ) క్రింద నేరానికి ఎఫ్ఐఆర్ నమోదుపై హైకోర్టు ఇచ్చిన తీర్పును ప్రక్కన పెట్టి చట్ట వైఖరిని సుస్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వ అప్పీలును అనుమతించి ప్రతివాది రెండు వారాల లోపు ట్రయల్ కోర్టు ముందు లొంగిపోవాలని ఆదేశిస్తూ భారత శిక్షాస్మృతిలోని సెక్షన్-195(ఎ) క్రింద సాక్షిని బెదిరించడం శిక్షార్హమైన నేరం అని కోర్టు నుండి అధికారిక ఫిర్యాదు కోసం వేచి ఉండకుండా నేరుగా ఎఫ్ఐఆర్ నమోదు చేసి ధర్యాప్తు చేయడానికి పోలీసులకు అది అధికారం ఇస్తుందని కూడా తే.28-10-2025 దీన భారత అత్యున్నత న్యాయ స్థానమైన సుప్రీం కోర్టు తీర్పును వెలువరించింది. (స్టేట్ ఆఫ్ కేరళ ఎదిరి సుని అలియాస్ సునీల్ క్రిమినల్ అప్పీల్ నెం /2025 ఎస్ఎల్‌పి (క్రిమినల్) నెం.6238/2024 విత్ 8223-8224)

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

పులివెందుల,జనవరి 12 , ప్రభాత వార్త :



వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ చికిత్స ఖర్చులు భరించలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్ ) నుంచి ఆర్థిక సహాయం అందేలా శాసనమండలి సభ్యులు శ్రీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని ఆయన సతీమణి భూమిరెడ్డి ఉమాదేవి తెలిపారు. గురువారం 23 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.22,82,743/ విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను వారి ఇళ్ల వద్దే లబ్ధిదారులకు, వారి కుటుంబ సభ్యులకు భూమిరెడ్డి ఉమాదేవి అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలకు ఈ సహాయం పెద్ద ఊరటగా నిలిచింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. చికిత్స కోసం ఎవరూ ఆర్థిక ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. అవసరంలో ఉన్న ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సహాయం అందేలా నిరంతరం కృషి చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. లబ్ధిదారుల కుటుంబ సభ్యులు ఈ సందర్భంగా శాసన మండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డికి, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. తమ కష్ట సమయంలో ప్రభుత్వం అండగా నిలవడం ఎంతో ధైర్యాన్నిచ్చిందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బొజ్జ మైసూరా రెడ్డి, తాళ్లపల్లి వెంకటేశ్వర రెడ్డి, జ్ఞానేశ్వర్ నాయుడు, ముచ్చుమర్రి మహేష్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఘనంగా వివేకానంద జయంతి వేడుకలు.

బి కొత్తకోట జనవరి 12 ప్రభాతవార్త :



భరతమాత ప్రియపుత్రుడు, ప్రపంచ యువతను జాగృతం చేసి మార్గది నిర్దేశం చేసిన విశ్వవిఖ్యాత తత్వవేత్త కర్మయోగి స్వామి వివేకానంద జయంతిని స్థానిక బిజెపి నేతలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన చిత్రపటానికి పూజలు నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షుడు మేడ ముకుంద బాబు, సీనియర్ నాయకులు రమేష్, రంగారెడ్డి, ఫక్రుద్దీన్, సకల రాము, మునిరాజు, భయ్యా రెడ్డి, భార్గవ్, ఎక్స్ ఆర్మీ ప్రసాద్, తుపాకుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కలికిరి, జనవరి 12, ప్రభాతవార్త:



పట్టణంలోని భారత్ కల్యాణ మండపంలో కలికిరి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఉత్సాహభరితంగా నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1981-86 మధ్యకాలంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులంతా సోమవారం ఆత్మీయ సమావేశమయ్యారు. వీరంతా వివిధ హోదాల్లో ఉంటూ తమ జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. దాదాపు 40 మంది విద్యార్థులు 45 సంవత్సరాల తరువాత ఒక చోట చేరి ఆత్మీయంగా కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వెంకట నారాయణరెడ్డి, రామ్మూర్తి, జనార్ధన్‌రెడ్డి, సిద్ధారెడ్డి, హైదర్‌ఖాన్, అల్లాజీ, జనరల్ స్టోర్ చిన్న, కేశవ, మస్తాన్, భాస్కర్, రమేష్, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

## వివేకానందుని స్ఫూర్తి నవభారతావనికి కీర్తి

పులివెందుల, జనవరి 12, ప్రభాత వార్త:



భారతీయ సంస్కృతి సంప్రదాయాలను, ఆధ్యాత్మిక హైందవ ధర్మాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు విశ్వ గురువు, యుగపు రుషుడు స్వామి వివేకా నందుడు, హైందవ జాతి ప్రాశస్త్యాన్ని, వేద వేదాంగాల పవిత్రతను 1893లో అమెరికాలోని చికాగోలో జరిగిన సర్వమత సమ్మేళనంలో నొక్కివక్కాణించి, భారతీయుల కీర్తి ప్రతిష్టలను, విలువలను ప్రపంచానికి చాటిచెప్పిన భరతమాత ముద్దుబిడ్డ స్వామి వివేకానంద చిరస్మరణీ యుడని పులివెందుల రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్వీ రమణ పేర్కొన్నారు. స్వామివి వేకానంద 163వ జయంత్యోత్సవాన్ని పురస్కరించుకుని, స్థానిక ముదునూరురోడ్డులోని వికలాంగుల కమ్యూనిటీ భవనంలో పులివెందుల పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఒక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిఐ, స్వామి వివేకనంద చిత్రపటానికి పూలమాల వేసి ఘననివాళు లు అర్పించారు. అనంత్నర పులివెందుల సబ్ డివిజన్ డిఎస్పి మురళి నాయక్ ఆర్థిక సహకారంతో 20 మంది దివ్యాంగులకు గృహపకర ణాలు పంపిణీ చేశారు. ఈసందర్బంగా డిఎస్పి మురళి నాయక్ సేవాస్ఫూర్తిని దివ్యాంగులు ప్రశంసించారు. తదనంతరం జై భారత్ సేవా సమితి అధ్యక్షులు ఓబులేసు ఆధ్వర్యంలో సర్వమత సమానత్వం, దేశఐక్యత, అఖండత, స్వేచ్ఛ, సమాన త్వం, సౌభ్రాతృత్వ భావనలు అందరిలో పెంపొందాలని దివ్యాంగులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల నెట్ వర్క్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఇరికిరెడ్డి రఘునాథ రెడ్డి, జై భారత్ సేవాసంస్థ అధ్యక్షులు బ్రాహ్మణపల్లి ఓబులేసు, దివ్యాంగుల లీగల్ సెల్ కన్వీనర్ అడ్వకేట్ తాడిపత్రి రమణ, చాగలేటి భాస్కర్, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు బిరుసు ప్రతాప్, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## స్వామి వివేకానంద మాటే APUS బాట




పీలేరు జనవరి 12 ప్రభాతవార్త:

పీలేరు శ్రీ స్వామి వివేకానంద సర్కిల్ వద్ద జాతీయ యువజన దినోత్సవం మరియు స్వామి వివేకానంద జయంతి ని పీలేరు డివిజన్ APUS బృందం ఘనంగా నిర్వహించారు. సనాతన ధర్మం ఔన్నత్యాన్ని.. భారతీయ విలువలను జాతీయ సమైక్యతను ప్రపంచానికి చాటిచెప్పిన సనాతన ధర్మం దార్శినికుడు మన స్వామి వివేకానంద నంద అని APUS సహాధ్యక్షుడు పచార్ల సుధాకర్ అభిప్రాయ పడ్డారు. ఈ కార్యక్రమం లో జిల్లా ఆర్థిక కార్యదర్శి శివ శంకర్, పీలేరు మండల భాద్యులు ఓబుల్ రెడ్డి గారు, జైపాల్ రెడ్డి మరియు గోవర్ధన్ ప్రసాద్, మధుసూదన్, రామాంజనేయ రెడ్డి. శంకర్ నాయుడు, జనార్దన్ రెడ్డి,అమరనాథ్, ద్వారక నాథ్, కృష్ణమూర్తి మొదలగు ఊధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రసన్న ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

గోపవరం. జనవరి. 12. ప్రభాతవార్త.



శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో అభిషేకములు ఆకు పూజలు. బద్వేల్ టౌన్ సిద్ధవటం రోడ్ ఆంజనేయ నగర్ లో ఉండే శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి దేవస్థానం నందు ధనుర్మాస సందర్భంగా ప్రత్యేక పూజలు 28వ రోజు సోమవారము శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి వారికి పంచామృత అభిషేకములు మరియు అష్టోత్తర పూజా కార్యక్రమ ములు మరియు సాయంత్రము 6:30 కు కుంకుమార్చన ఆకు పూజ కార్యక్రమంలో పూజారి జయసింహ మరియు పని స్వామి వారి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగినది. ఈరోజు ఉభయ దాతలు కటారురామయ్య వీరి ధర్మపత్ని కిరణ్ కుమారి. బద్వేల్ టౌన్ భారతీయ జనతా పార్టీ ఉపాధ్యక్షురాలు.వారి కుటుంబ సభ్యులు పాల్గొనడం జరిగినది. వీరికి శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి వారి ఆశీస్సులు ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలతో నిండు నూరేళ్ల ఉండాలని ఆలయ కమిటీ వారి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగినది.

## రోడ్డు నియమాలు పాటించాలి

పులివెందుల జనవరి 12 ప్రభాత వార్త :




ట్రాఫిక్ వారోత్సవాల్లో భాగంగా పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లి గ్రామంలో పులివెందుల అర్బన్ సీఐ సీతారామరెడ్డి సోమవారం తన సిబ్బందితో కలిసి ప్రజలకు ట్రాఫిక్, సైబర్ భద్రత మరియు చట్టపరమైన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక వాహనంపై ప్రయాణించే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, జీపు, కారు వంటి నాలుగు చక్రాల వాహనాల్లో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని సూచించారు. అలాగే పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద కాల్స్, లింక్స్, మెసేజ్‌లకు స్పందించకుండా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రజలు ఇతర ఊర్లకు వెళ్లేటప్పుడు ఇంటిలో డబ్బు, బంగారు ఆభరణాలు వంటి విలువైన వస్తువుల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకొని వెళ్లాలని సూచించారు. గ్రామాల్లో కోడిపందాలు, జూదాలు వంటి చట్టవిరుద్ధ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని హెచ్చరిస్తూ, ఇటువంటి కార్యక్రమాల్లో ఎవరైనా పాల్గొన్నట్లయితే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొని ప్రజలకు పలు సూచనలు, భద్రతా మార్గదర్శకాలు వివరించారు.

## మాజీ మంత్రి రోజాతో శ్రీకాంత్‌రెడ్డి భేటీ

సంబేపల్లె జనవరి 12 ప్రభాతవార్త

మండలం శెట్టిపల్లె గ్రామం తిమ్మక్కగారిపల్లెలో సోమవారం మాజీ మంత్రి రోజా తో వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి భేటీ అయ్యారు. వైఎస్ఆర్ సిపి పార్లమెంటరీ రాష్ట్ర కార్యదర్శి గొర్ల ఉపేంద్రా రెడ్డి, జెడ్ పి టి సి గొర్ల కవిత రమేష్ రెడ్డి ల నివాసంలో రోజా ను శ్రీకాంత్ రెడ్డి ని కలసి పార్టీ అంశాలపై చర్చించారు. వైఎస్ఆర్ సిపి స్టేట్ ఎక్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, మండల జెసిఎస్ కన్వీనర్ వడ్డీ వెంకట రమణా రెడ్డి, మాజీ ఎంపిపి నాగిరెడ్డి, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి గొర్ల అనిరుద్ రెడ్డి, సర్పంచ్ వెంకట రమణ నాయక్, నాయకులు వాయల్పాటి ఆనంద కుమార్ రెడ్డి, నరసింహా రెడ్డి,శంకరయ్య నాయుడు, జాఫర్, మిరియాల జయ నారాయణరెడ్డి, కిషోర్ రెడ్డి, మహేశ్వర, కోట ఆంజనేయులు నాయుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## యువతకు స్ఫూర్తి స్వామి వివేకానంద

చాపాడు. జనవరి 12. ప్రభాతవార్త:



భారతీయ యువతను కదిలించిన గొప్ప మహనీయుడు స్వామి వివేకానందుడని వివేకానంద పాఠశాల కరస్పాండెంట్, బి. నాగేశ్వర్ రెడ్డి తెలిపారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా మండలంలోని చిన్నగురువలూరు వివేకానంద విద్యానికేతన్ నందు సోమవారం జయంతి వేడుకలు నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూజ అనంతరం ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూఆ మహనీయుడు స్ఫూర్తితోప్రపంచంలో గొప్ప విద్యావంతులన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గాలివీడు-1 సచివాలయం తనిఖీ

గాలివీడు, జనవరి 12(ప్రభాతవార్త):



మండల కేంద్రంలోని గాలివీడు-1 గ్రామ సచివాలయాన్ని సోమవారం ఎంపీడీఓ చంద్రమౌళీశ్వర్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయంలో అమలవుతున్న వివిధ ప్రభుత్వ పథకాలు, ప్రజలకు అందిస్తున్న సేవల నాణ్యత, సేవల అమలు విధానం వంటి అంశాలను సవివరంగా పరిశీలించారు. సచివాలయ సిబ్బంది హాజరు రిజిస్టర్లు, కార్యాలయ రికార్డులు, దరఖాస్తుల పరిష్కార స్థితి, ఫైళ్ల నిర్వహణ విధానం తదితరాలను సమగ్రంగా తనిఖీ చేశారు. అలాగే కార్యాలయ పరిశుభ్రత, సేవల పారదర్శకతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజలకు అందించే సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని పనులు సకాలంలో పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. లోపాలు గుర్తించిన చోట తక్షణమే సరిదిద్దాలని, సేవల నాణ్యతను మరింత మెరుగుపరచాలని సిబ్బందిని ఆదేశించారు.

## బిజెపి మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షులుగా ఇలియాస్

కడప కార్పొరేషన్, జనవరి 12 ప్రభాతవార్త:



భారతీయ జనతా పార్టీ మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షులుగా ఇలియాస్ నియమితులయ్యారు. బిజెపి జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు వెంకటసుబ్బారెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఇలియాస్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి నాకు భారతీయ జనతా పార్టీ కడప జిల్లా మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షులుగా నియమించిన బిజెపి జిల్లా అధ్యక్షులు జంగిటి వెంకట సుబ్బారెడ్డి కి ధన్యవాదాలు తెలిపారు. తనకు సహకరించిన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ కి , రాష్ట్ర కుటుంబ ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పారు. రాష్ట్ర మార్క్ ఫెడ్ డైరెక్టర్ వంగల శశి భూషణ్ రెడ్డి కి,మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ బాషా కి, జమ్మలమడుగు ఎమ్మెల్యే చదిపిరాళ్ల ఆదినారాయణ రెడ్డి కి, బీజేవైఎం జాతీయ నాయకులు బత్తల పవన్ కుమార్ కు, భారతీయ జనతా పార్టీ కుటుంబ సభ్యులకు అందరికీ నా హృదయ ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి తన వంతుగా కృషి చేస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు ప్రవీణ్ నాయుడు పాల్గొన్నారు.

## చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

రామసముద్రం జనవరి 12 ప్రభాతవార్త

సంక్రాంతి పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్సై ఉమామహేశ్వర్ రెడ్డి ప్రజలకు సూచించారు. పండుగ రోజులలో కోడి పందేలు, జూదాలు వంటి చట్టవిరుద్ధ కార్యక్రమాలు నిర్వహిస్తే సంబంధితులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ, గ్రామాలు మరియు పట్టణ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ప్రత్యేక నిఘా బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో ఎక్కడైనా అక్రమ కార్యక్రమాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై ఎలాంటి మినహాయింపులు ఉండవని ఎస్సై ఉమామహేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు.

## అనధికారిక లేఅవుట్లపై కమిషనర్ చర్యలు

యర్రగుంట్ల జనవరి 12, ప్రభాతవార్త :



పట్టణంలో అనధికార లేఔట్లపై మున్సిపల్ కమిషనర్ శేష ఫణి కన్నెర్ర చేశారు. సోమవారం పట్టణంలోని అనధికారిక లేఅవుట్లపై చర్యలకు ఉపక్రమించారు. సర్వేNo.622 (P), 623,299/1,300/2, 301/1A,344/1A, 337(P), 3381,2,3,4 ,189(P), 64A, 65A(P) లేఅవుట్లను మున్సిపల్ సిబ్బంది లేఔట్ల సరిహద్దు రాళ్లను,కాంపౌండ్ ఫెన్సింగ్ లను తొలగించారు. యజమానుల నుండి స్పందన కొరవడంతో చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. పట్టణంలోని అనధికారిక లేఔట్ లో ఉన్న యజమానులు మొదటి విడత రుసుము రూ.10 వేలు చెల్లించి రెగ్యులరైజేషన్ చేసుకోవాలని సూచించారు.

## విగ్రహావిష్కరణకు తాసిల్దార్‌కు వినతిపత్రం

తంబళ్లపల్లె జనవరి 12 ప్రభాతవార్త ః



మండల కేంద్రంలో స్వతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న విగ్రహం ఏర్పాటు స్థలానికి అనుమతి ఇవ్వాలని తాసిల్దార్ శ్రీనివాసులు, ఎంపీటీవో బాపూజీ పట్నాయక్‌లకు మండలంలోని వడ్డెర సంఘం నాయకులు కోరారు. సోమవారం వడ్డెర సంఘ అధ్యక్షుడు రేపన మల్లికార్జున ఆధ్వర్యంలో సంఘం సభ్యులు కాస్‌రోడ్‌లో బసవన్న రాతి వద్ద లేక మొలకల చెరువు సర్కిల్ వద్ద వడ్డే ఓబన్న విగ్రహం ఏర్పాటుకు అనుమతించాలని కోరారు. అదేవిధంగా క్రాస్ రోడ్ లో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందని వారపు సంత ప్రభుత్వ స్థలంలో నిర్వహించాలని అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పూజారి వెంకటరమణ, రామ లక్ష్మమ్మ, పద్మావతి, ఉప్పుతోళ్ల శివరాం, శివకేశవ, దేరంగుల మనోహర్, ఒలిపి రవికుమార్, ఇడగొట్టు రమేష్ బాబు, రెడ్డప్ప, తేపల్లి మల్లికార్జున, శంకర, గోపాలకృష్ణ, వెంకటరమణ వెంకటరమణ, శ్రీనివాసులు, వీరభద్ర, రవీంద్ర, దాసప్ప,మండలంలోని వడ్డెర సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చెయ్యేరులో సంక్రాంతి సంబరాలు

నందలూరు, జనవరి 12 ప్రభాతవార్త :

మండలంలోని చెయ్యేరు (బహుధానది)లో కనుమ పండుగ సందర్భంగా ఈనెల 16వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు డాన్స్ బేబీ డాన్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్ గుండు మల్లికార్జున్ రెడ్డి తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి ఆకర్షనీయమైన బహుమతులను రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి చేతుల మీదుగా విజేతలకు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో ఆసక్తి గలవారు పాల్గొనాలని కోరారు.

## సంక్రాంతికి ఊళ్లకు వెళితే తస్మాత్ జాగ్రత్త

తంబళ్లపల్లె జనవరి 12 ప్రభాతవార్త ః

మండలంలోని ప్రజలు సంక్రాంతి పండుగ సందర్భంగా ఊళ్లకు వెళ్లాలనుకునే వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక పోలీసులు పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారు. ఎస్సై అనిల్ కుమార్ ఆదేశాల మేరకు సిబ్బంది ఆటోలో మైక్ ద్వారా సంక్రాంతికి ఊర్లకు వెళితే సంబంధిత సమాచారం పక్కింటి వారితోపాటు పోలీసులకు ఇవ్వాలని విలువైన ఆభరణాలు, డబ్బు లాకర్లలో ఉంచుకోవాలని ఇంటి తాళాలు అక్కడే ఉంచకుండా వెంట తీసుకొని వెళ్లాలని జాగ్రత్తలను ప్రచారం నిర్వహించారు. మండలంలోని 21 పంచాయతీలలో ఆటోల ద్వారా చేస్తున్న ప్రచారంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## పండుగను శాంతియుతంగా జరుపుకోవాలి

సుండుపల్లి, జనవరి 12,ప్రభాతవార్త :

సంక్రాంతి పండుగ అనేది కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా, శాంతియుతంగా, సంప్రదాయబద్ధంగా జరుపుకునే మహత్తరమైన పండుగ. అయితే ఈ పండుగను అవాంఛనీయమైన, అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా మార్చకూడదని పోలీస్ శాఖ ప్రజలను విజ్ఞప్తి చేస్తోంది. ముఖ్యంగా సంక్రాంతి పండుగ సందర్భంలో కోడిపందెం, మట్కా, జూదం, ఇంటిని వదిలి వేరే ప్రాంతాలకు వెళ్లే వారు పోలీసు వారికి సమాచారం ఇస్తే ఆ ఇంటిపై పోలీసులు నిఘా పెట్టుబడుతుందని, దూర ప్రయాణాలు చేసేవారు తమ విలువైన బంగారు వస్తువులను జాగ్రత్తగా బ్యాగులో పెట్టుకుని ప్రయాణం చేయాలని సూచించారు. చట్టాన్ని అతిక్రమించే వారిపై ఎలాంటి సడలింపులు ఉండవని హెచ్చరిస్తోంది. కావున మండల పరిధిలోని ప్రజల సహకారంతోనే శాంతి భద్రతలు సాధ్యమవుతాయని, ఎవరైనా అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు గమనిస్తే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సబ్ ఇన్స్పెక్టర్ ఎస్ ఏం కె హుస్సేన్ సాబ్ తెలియజేసారు.

## క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు ట్రోఫి అందజేత

రామసముద్రం జనవరి 12 ప్రభాతవార్త



మండల పరిధిలోని కర్ణాటక భార్డర్ లోని నారాయణపురం గ్రామంలో సంక్రాంతి పండుగ సంబరాలు సందర్భంగా యువతకు క్రికెట్ పోటీలు ఏర్పాటు చేయడం జరిగింది. ముఖ్యఅతిధిగా వాల్మీకి జిల్లా నాయకులు కురిజల ఎంపిటీసీ దొడ్డిపల్లె ఆనందను ముఖ్య అతిధులు గా గ్రామస్థులు ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత క్రీడలు స్నేహపూర్వక సంబంధాన్ని పెంపొందిస్తాయని, గ్రామీణప్రాంతాలలోని యువకులను ప్రోత్సహించినతో పాటు మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు.క్రికెట్ టోర్నమెంట్ విజేత నారాయణపురం జట్టు కు ట్రోఫి,నగదు రన్నర్ జట్టు సోమయాజుల పల్లె జట్టుకు నగదు దొడ్డిపల్లె ఆనంద చేతులు మీదుగా అందజేశారు. క్రికెట్ టోర్నమెంట్ ముఖ్య అతిధిగా పాల్గొన్నా దొడ్డిపల్లె ఆనంద కు శాలువ కప్పి, హారం వేసి సీల్డ్ అందజేసి ఘనంగా గ్రామస్థులు సన్మానం చేశారు.

## పెద్దన పాడులో అల్లసాని విగ్రహం ఏర్పాటు

యర్రగుంట్ల జనవరి 11, ప్రభాతవార్త :



మండల పరిధిలో గల పెద్దనపాడు గ్రామంలో ఉన్న శివాలయంలో కొత్తపు రామ్మోహన్ రెడ్డి ఏర్పాటు చేసిన అల్లసాని పెద్దన విగ్రహాన్ని సోమవారం పంపా క్షేత్ర పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ గోవిందానంద సరస్వతి స్వామి ఆవిష్కరించారు. అల్లసాని పెద్దన నడిఆడిన పెద్దన పాడు గ్రామంలో పవిత్రమైన శివాలయం క్షేత్రంలో నందు అల్లసాని విగ్రహం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. తెలుగు భాష యొక్క గొప్పతనాన్న దేశానికి చాటి చెప్పిన మహోన్నతమైన వ్యక్తి అల్లసాని పెద్దనాన్ని అన్నారు. అనంతరం శతాధికా కవి సమ్మేళన పుస్తకావిష్కరణ చేశారు ఈ కార్యక్రమంలో జిల్లా సాహితీ సంఘం అధ్యక్షుడు మల్లికార్జున్ రెడ్డి, జింక సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్య పరిష్కారం చేయండి

సిద్ధవటం జనవరి 12 ప్రభాతవార్త



రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారం కొరకు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పలు భూ సమస్యల పరిష్కారం కొరకై రెవిన్యూ క్లినిక్ ఏర్పాటు చేశారు మండల కేంద్రమైన సిద్ధవటం తాసిల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పలు భూ వివాద సమస్యల పరిష్కారం కొరకు రెవిన్యూ క్లినిక్ ఏర్పాటు చేశారు. మాధవరం, గ్రామంలోని ఎస్‌కేఆర్ నగర్ దళిత రైతులు సర్వే నెంబర్ 937 నందు కొన్నేళ్లగా మా అనుభవంలో ఉన్న భూములను సాగు చేసుకుంటూ ఉన్నామని కొంతమంది అగ్రవర్ణాల రైతులు మా భూములను అన్యాక్రాంతాలు చేయడానికి కుట్రబడి దళితుల రైతులకు అన్యాయం చేస్తున్నారని రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తూ భూములను అన్యాక్రాంతం చేయడానికి కుట్రపడ్డారని న్యాయం చేయాలని రెవిన్యూ క్లినిక్ లో కడప ఆర్టీవో జాన్ ఇర్విన్ కు ఫిర్యాదు చేశారు దళిత రైతులు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారిన మా దళిత రైతుల తలరాతలు మారలేదని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దళిత రైతుల సమస్యల కోసం కృషి చేయాలని కొన్ని ఏళ్లగా మా అనుభవంలో ఉన్న భూములపై బడా నేతలు అన్యాక్రాంతం చేయాలని చూస్తున్నారని మా రైతుల సమస్యలు పరిష్కారం కొరకు రెవిన్యూ క్లినిక్ లో కడప ఆర్టీవోకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశామని తెలిపారు.

## పచ్చదనం పెంచేందుకు మొక్కలు నాటండి

సిద్ధవటం జనవరి 12 ప్రభాతవార్త

పర్యవరాన్ని పెంచేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కడప ఫారెస్ట్ రేంజ్ అధికారి ప్రసాద్ తెలిపారు, మండలంలోని కడప చెన్నై జాతీయ రహదారి, రాజీవ్ స్మృతి వనంలో ఆయన సోమవారం మాట్లాడుతూ పలు ఔషధ మొక్కలు నర్సరీ ద్వారా పెంపకం చేస్తున్నామని పర్యావరణాన్ని పెంచేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ప్రభుత్వ,, ప్రవేట్ కళాశాలలో విద్యార్థుల చేత మొక్కలు నాటించి పచ్చదనాన్ని పెంచేందుకు కృషి చేయాలని తెలిపారు, ఎర్రచందనం, జామ, ఉసిరి, యలమ, వెదురు, వేప, కానిగ, టేకు, మునగ, ఎర్రగన్నేరు, మొదలగు ఔషధ మొక్కలు నర్సరీలో పెంపకం చేపట్టామని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచేందుకు కృషి చేయాలని తెలిపారు

## ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

నందలూరు ,జనవరి 12 ప్రభాతవార్త :



ప్రకృతి వ్యవసాయాన్ని అవలంబించడం ద్వారా రైతుకు మంచి ఆరోగ్యం లభించడమే కాకుండా స్థిరమైన సాగుకు అవకాశాలు ఉంటాయని వెలుగు శాఖ అధికారి శ్రీహరి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని దుర్గాపురంలో ప్రకృతి వ్యవసాయంపై మండల స్థాయి కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై రైతులకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించి, ఉత్తమ ప్రకృతి వ్యవసాయ రైతులను సన్మానించారు. అనంతరం శ్రీహరి మాట్లాడుతూ ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయాన్ని అవలంబించడం ద్వారా తన ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు రసాయన రహితమైన, సురక్షిత ఆహారాన్ని పొందవచ్చని తెలిపారు. భూమిలో కార్బన్ శాతం పెరిగి నేల కోత తగ్గుతుందని, పశుపాలనతో కూడిన వ్యవసాయంలో పాల ఉత్పత్తులు కూడా పెరుగుతాయని పేర్కొన్నారు. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయాన్ని తప్పనిసరిగా అవలంబించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీవో మురళి, కమ్యూనికేషన్ ఇంటర్న్ వీణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## వివేకానంద జయంతి ఉత్సవాలు

ప్రొద్దుటూరు అర్బన్, జనవరి 12 ప్రభాతవార్త



స్థానిక రాణి తిరుమల దేవి డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్వామీ వివేకానంద జయంతి సందర్భంగా కళశాలలో వివేకానందుని చిత్రపటానికి ప్రిన్సిపల్ టమటం చంద్ర శేఖర్ రెడ్డి పూలమాలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానందుని ఆశయ సాధనకు ప్రతి ఒక్క విద్యార్థినీ,విద్యార్థి కృషి చేయవలసిన బాధ్యత ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్,వైస్ ప్రిన్సిపల్ వెంకటేశ్వర రెడ్డి, అధ్యాపక అధ్యాపకేతర బృందం, ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇస్కాన్ మందిరంలో శ్రీమద్ భాగవత ప్రవచనాలు

ప్రొద్దుటూరు అర్బన్, జనవరి 12, ప్రభాతవార్త :

అంతర్జాతీయ కృష్ణచైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా శ్రీమద్ భాగవత ప్రవచనాలు నిర్వహిస్తున్నామని ఇస్కాన్ ప్రతినిధులు వసుమన వెంకటేశ దాసు, సాక్షాత్తు నారాయణ ప్రభు తెలిపారు. సోమవారం వారు స్థానిక ప్రెస్ క్లబ్ లో విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ భోగి, సంక్రాంతి రెండు రోజుల పాటు స్థానిక కొర్రపాడు రోడ్డు లోని రిలయన్స్ మార్ట్ వద్ద వున్న ఇస్కాన్ మందిరంలో భీష్ముని కథా ప్రవచనాలు శ్రీమాన్ మధురేశ్ ప్రభూజి చేస్తారని వివరించారు. సాయంత్రం 6:30 నుండి 8:00 గంటల వరకు సాగే ఈ కార్యక్రమం అనంతరం కృష్ణ ప్రసాద వితరణ ఉంటుందన్నారు. కావున ప్రజలు పాల్గొనాలని కోరారు.

## ప్రధాన కార్యదర్శిగా గంగాధర్ నాయుడు

ఖాజీపేట, జనవరి 12, ప్రభాతవార్త:



భారతీయ జనతా పార్టీ కడప జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా ఖాజీపేట మండలం పత్తూరు గ్రామానికి చెందిన గంగాధర్ నాయుడు నియమితులయ్యారు. జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ముప్పే వెంకటరాముడు నాయుడు ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. పార్టీ పట్ల గంగాధర్ నాయుడు చూపుతున్న అంకితభావం, పార్టీ బలోపేతానికి ఆయన చేస్తున్న సేవలను గుర్తించిన పార్టీ అధిష్టానం ఈ బాధ్యతలను అప్పగించినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా గంగాధర్ నాయుడు మాట్లాడుతూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా తనపై నమ్మకం ఉంచి అవకాశం కల్పించినందుకు ఆనందం వ్యక్తం చేశారు. తనకు ఈ పదవి దక్కేందుకు ప్రోత్సహించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు జంగిటి వెంకటసుబ్బారెడ్డి, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ముప్పే వెంకటరాముడు నాయుడు, పార్టీ రాష్ట్ర నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో పార్టీని మరింత పటిష్టం చేయడానికి అంకితభావంతో పనిచేస్తానని గంగాధర్ నాయుడు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి, వెనుకబడిన తరగతుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు.

## కోతులను అటవీ ప్రాంతానికి తరలించారు

సుండుపల్లి, జనవరి 12,ప్రభాతవార్త :

మండల పరిధిలోని పత్తి వాండ్ల పల్లె రైతుల పంటలను కోతుల బెడద నుంచి కాపాడాలని బాధిత రైతులు వేడుకొన్నప్పటికి, రెవెన్యూ అధికారులు, అటవీ శాఖ అధికారులు స్పందించి నష్ట నివారణ చర్యలు తీసుకోవడంలో విఫలమవడంతో బాధిత రైతులు ఏకమై చందాలు వేసుకుని కోతులను పట్టి అటవీ ప్రాంతానికి తరలించడం జరిగిందని రాయచోటి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ మాజీ సభ్యులు సుండుపల్లి మండల నివాసి యర్రపురెడ్డి. విశ్వనాధ రెడ్డి తెలియజేసారు .రైతులు పెట్టిన కూరగాయ పంటలు,వేరుశెనగ,మామిడి, సపోటా, టెంకాయలు ,ఇతర పండ్లతోటల్లో కాయలు పీకేయడమే కాకుండా,నివాస గృహాల్లోకి చొరబడి ఆహార పదార్థాలు ఎత్తుకెళ్ళి నష్టం కలుగజేస్తూడడంతో రైతులు లబోదిబో మంటూ ప్రభుత్వానికి గతంలో విన్నవించారు. సుమారు 63 కోతుల గుంపు నివాసం ఏర్పాటు చేసుకొని రైతులకు చుక్కలు చూపిస్తుండడంతో, ప్రభుత్వ యంత్రాంగం చొరవ తీసుకొని రైతులకు ఆదుకోలేని కారణంగా రైతులు స్వచ్ఛందంగా స్వంత ఖర్చులతో కోతులను పట్టే వారికి , రవాణా ఖర్చులు, ఇతర ఖర్చులతో అటవీ ప్రాంతానికి సురక్షితంగా తరలించారు.

## చిరస్మరణీయుడు ఎల్లాప్రగడ సుబ్బారావు

ప్రొద్దుటూరు అర్బన్ జనవరి 12 ప్రభాత వార్త



స్థానిక శ్రీరాముల పేట లోని ఉపాధ్యాయ సేవా కేంద్రంలో ప్రముఖ జీవ రసాయన శాస్త్రవేత్త డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి మాట్లాడుతూ ఆధునిక వైద్య రంగంలో అత్యంత కీలకమైన అనేక ఔషధాల అభివృద్ధికి కృషి చేసిన ఎల్లా ప్రగడ సుబ్బారావు చిరస్మరణీయులన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టిఆర్ వైద్యవిశ్వ విద్యాలయం పాలక మండలి సభ్యులు డాక్టర్ వరుణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ క్యాన్సర్ చికిత్సలో విప్లవాత్మక ఔషధం టెట్రా సైక్లిన్ వంటి యాంటీ బయోటిక్స్ అభివృద్ధికి ఆయన మార్గదర్శకుడని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, రామచంద్ర రెడ్డి, భోగా గంగాధర్, రాజు, షేక్ షా వల్లి , సుధాకర్, ప్రతాప్ స్వామి, కిషోర్,రామమోహన్ పాల్గొన్నారు.

## ప్రజలు, కార్యకర్తలతో మమేకమైన శ్రీకాంత్‌రెడ్డి

చిన్నమండెం జనవరి 12 ప్రభాతవార్త:



మండలంలోని కేసాపురం గ్రామం రెడ్డివారిపల్లెలో సోమవారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, వైఎస్ఆర్ సిపి కార్యకర్తలు, నాయకులతో ఆయన సన్నిహితంగా మమేకమయ్యారు. ప్రతి ఒక్కరినీ పేరు పేరునా ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలు, కష్టాలను అడిగి తెలుసుకున్నారు. సమిష్టి కృషితో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆయన కార్యకర్తలను కోరారు. ఈ పర్యటనలో భాగంగా, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి మామ, కేసాపురం గ్రామం రెడ్డివారిపల్లె నివాసి రాజభూపాల్ రెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతూ విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న శ్రీకాంత్ రెడ్డి, వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. వైఎస్ఆర్ సిపి సీనియర్ నాయకులు ప్రేమానందరెడ్డి, బాబురెడ్డి, తిమ్మారెడ్డి, నిరంజన్‌రెడ్డి, ఎంపిటిసి రెడ్డెప్ప, జేసీఎస్ మండల కన్వీనర్ చుక్కా అంజనప్ప, శివారెడ్డి,నాగేశారెడ్డి, ఆనందరెడ్డి, ఖాజాఖాన్, నరేష్‌నాయుడు, నర్సరీ రమణ, జయ శంకర్ రెడ్డి, వెంకట్రాయుడు, రామాంజులు రెడ్డి, సుబ్బయ్య, దశరథ పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతాని కృషి చేయండి

పీలేరు జనవరి 12 ప్రభాతవార్త:



పరిశీలకులతో మాట్లాడుతున్న హరి

పీలేరు నియోజకవర్గంలో విస్తృత సమావేశానికి వచ్చిన నియోజకవర్గ పరిశీలకుడు సుబ్బారెడ్డిని సోమవారం మర్యాదపూర్వకంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆధ్వర్యంలో పలువురు కలిసి నియోజకవర్గ సమస్యలపై చర్చించినట్లు రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి హరి తెలిపారు. నియోజకవర్గమే కాకుండా జిల్లా వ్యాప్తంగా గతంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని ఆయన కోరినట్లు అదే తెలిపారు .ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి వి హరి ,మాజీ జెడ్పిటిసి శివానందరెడ్డి నాయకులు చిన్న ఎల్లప్ప, రవి, మండల కన్వీనర్ మన్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

చాపాడు. జనవరి 12. ప్రభాతవార్త:

మండలంలోని లక్ష్మీ పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు సోమవారం 2002-03 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువులను సత్కరించడంతోపాటు, పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలుతమఅమూల్యమైన సందేశాన్ని ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గురువులు సావిత్రి, చెన్నయ్య, శివరాం, శీను,చిన్నకేశవరెడ్డి, పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు.



## ఎస్‌టియూ మదనపల్లి పట్టణ శాఖ కార్యవర్గం ఎన్నిక

మదనపల్లె క్రైమ్ జనవరి 12 ప్రభాతవార్త.




మున్సిపల్ ఉపాధ్యాయ సమస్యల పట్ల అలుపెరగని పోరాటం చేస్తాం అని ఎస్‌టియు మదనపల్లి పట్టణ శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన పి మునిరాజ, శివకుమార్‌లు తెలిపారు. సోమవారం ఎస్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి పోకల మధుసూదన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పట్టణ శాఖ కార్యవర్గ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పి. మధుసూదన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పిఆర్‌సి కమిటీను నియమించాలి అని, కమిటీ నివేదిక వచ్చేలోగా 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలి అని డిమాండ్ చేశారు. పట్టణ ఆర్థిక కార్యదర్శిగా ఎ.బాల వర ప్రసాద్, జిల్లా కార్యదర్శులుగా రెడ్డప్ప రెడ్డి, యం. అశోక, వి.శ్రీనివాసులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

## పిజిఆర్ఎస్ అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ చూపండి

పీలేరు జనవరి 12 ప్రభాతవార్త:



మాట్లాడుతున్న తహసిల్దార్ శివకుమార్

మండల పరిధిలో ప్రతి సోమవారం జరిగే పిజిఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లా అధికారులకు మండల కార్యాలయంలో తహసిల్దారులకు డివిజనల్ అధికారులకు పీలేరు మండల పరిధిలోని ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో ఇచ్చే అర్జీలపై స్థానిక వీఆర్వోలు ప్రత్యేక శ్రద్ధ చూపే దిశగా పరిష్కార మార్గాలు చూడాలని తహసిల్దార్ శివకుమార్ అన్నారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో పిజిఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా హౌసింగ్ పట్టాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని అర్హులు ఉన్నవారికి ప్రతి ఒక్కరికి పట్టాయి ఇచ్చే విధంగా ప్రయత్నించాలని అన్నారు అలాగే అనర్హులను తొలగించి ప్రభుత్వానికి నివేదించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసిల్దార్ ప్రసాద్, ఆర్ ఐ మురగయ్య వీఆర్వోలు రెవెన్యూ సిబ్బంది హౌసింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

పీలేరు జనవరి 12 ప్రభాతవార్త:

సంక్రాంతి పండుగ అనేది కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా, శాంతియుతంగా, సంప్రదాయబద్ధంగా జరుపుకునే మహత్తరమైన పండుగ. అయితే ఈ పండుగను అవాంఛనీయమైన, అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా మార్చకూడదని సిఐ యుగంధర్ ప్రజలను విజ్ఞప్తి చేస్తోందన్నారు. ముఖ్యంగా సం క్రాంతి పండుగ సందర్భంలో కోడిపందెం, మట్కా, జూదం, ఇంటిని వదిలి వేరే ప్రాంతాలకు వెళ్లే వారు పోలీసు వారికి సమాచారం ఇస్తే ఆ ఇంటిపై పోలీ సులు నిఘా పెట్టుబడుతుందని, దూర ప్రయాణాలు చేసేవారు తమ విలువైన బంగారు వస్తువులను జాగ్రత్తగా బ్యాగులో పెట్టుకుని ప్రయాణం చేయాలని సూచించారు. అలాగే ప్రజా శాంతి భద్రతలకు భంగం కలిగించే ఇతర చట్ట విరుద్ధ చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టంగా తెలియజేయబడుతుందన్నారు. ఇలాంటి అక్రమ కార్యక్రమాలపై పోలీస్ శాఖ నిరంతర నిఘా ఏర్పాటు చేసి, ప్రత్యేక బృందాలతో తనిఖీలు నిర్వహించనుందన్నారు.

## పీడీ యాక్ట్ ఎత్తివేసి జైలు నుండి విడుదల చేయాలి

రాయచోటి టౌన్ జనవరి 12 ప్రభాతవార్త



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ నిర్బంధ చట్టాలకు వ్యతిరేకంగా సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో సీఐటీయూ మున్సిపల్ అంగన్వాడీ రంగం నేతలు ఎ. రామాంజులు సి. రాంబాబు, డి. భాగ్యలక్ష్మిలు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో రైతు సంఘం నాయకుడు అప్పలరాజుపై పిడి యాక్ట్ పెట్టడంతో ప్రజా సమస్యలపై ప్రభుత్వం పనితీరు అద్దం పడుతోందన్నారు.అప్పలరాజు మీద 17 కేసులు ప్రజాసమస్యలపై పని చేసిన కేసులేనని వీటిలో 13 కేసులు కొట్టివేశారన్నారు. 4 కేసులు ఇంకా పరిశోధనలోనే ఉన్నాయన్నారు. శాంతియుత పద్ధతుల్లో నిరసన చేసి రైతుల భూములకు 2013 భూసేకరణ చట్ట ప్రకారం పరిహారం ఇవ్వాలని అడిగితే ప్రభుత్వమే ఏకంగా పీడీ యాక్ట్ పెట్టడం దుర్మార్గం అన్నారు. ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులపై రౌడీ షీట్లు పెట్టడం వెనుక రైతుల భూములను కార్పొరేట్ లకు అనుకూలంగా వ్యవహరించడమేనన్నారు. అప్పలరాజుపై పీడీ యాక్ట్ ఎత్తివేసి జైలు నుండి రిలీజ్ చేసే వరకు ప్రజాస్వామ్య వాదులను ప్రజలను రైతులను కలుపుకొని రాబోవు కాలం లో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో సీఐటీయూ కార్యకర్తలు తిరుపాల్ ,వై. వి రమణ , సురేఖ, కవిత, రమణమ్మ చెన్నయ్య రెడ్డెయ్య, వారీస్ లుపాల్గొన్నారు

## సాంస్కృతి,సాంప్రదాయాలకు ప్రత్యేక సంక్రాంతి

కురబలకోట జనవరి 12 ప్రభాతవార్త



తెలుగు సాంస్కృతిక, సాంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి పండుగనీ మీట్స్ యూనివర్సిటీ వ్యవస్థాపకులు, ఛాన్సలర్ ఎన్ .విజయభాస్కర్ చౌదరి అన్నారు. కురబలకోట మండలం అంగళ్ల గ్రామానికి సమీపంలో మీట్స్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీలో ఆర్ట్స్ అండ్ కల్చరల్ క్లబ్ మరియు ఫిలిం మేకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం పల్లె వాతావరణంలో సంక్రాంతి ముందస్తు సంబరాలు నిర్వహించారు. యూనివర్సిటీ ఫౌండర్ అండ్ ఛాన్సలర్ డాక్టర్ ఎన్. విజయభాస్కర్ చౌదరి మాట్లాడుతూ ప్రజలు మూడు రోజులపాటు జరుపుకునే తెలుగు పండుగ సంక్రాంతి అని అన్నారు. విద్యార్థులకు మరియు తల్లిదండ్రులకు యూనివర్సిటీ తరపున మరియు సిబ్బంది తరపున మంచి జరగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రో ఛాన్సర్ ఎం. ద్వారకానాథ్. వైస్ ఛాన్సర్ డాక్టర్ సి యువరాజులు యూనివర్సిటీ రిజిస్టర్ డాక్టర్ డి ప్రదీప్ కుమార్, విభాగాధిపతులు, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు భోగిమంటల చుట్టూ కోలాటాలు సాంస్కృతి నృత్యాలు చేస్తూ ఆలోచించడమే కాకుండా గాలిపటాలు ఎగరేస్తూ యూనివర్సిటీలో సందడి చేశారు.

## మండల ప్రజలకు అందుబాటులో ఉంటా

నిమ్మనపల్లె, జనవరి 12 ప్రభాతవార్త :

నిమ్మనపల్లె మండల ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని నూతనంగా సోమవారం పదవీబాధ్యతలుచేపట్టిన ఎస్ఐ రామక్రిష్ణ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో జూదాలు జరగకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మండల కేంద్రమైన నిమ్మనపల్లెలో ట్రాఫిక్ సమస్య నివారిస్తానని తెలిపారు. ద్విచక్రవాహనదారులకు హెల్మిట్‌తో పాటు రికార్డులు పరిశీలించడం, మైనర్ వాహనాలను నడపరాదన్నారు.

## బిజెపి జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులుగా వెంకటరమణ

కడప కార్పొరేషన్ జనవరి 12 ప్రభాతవార్త:



కడప జిల్లా బిజెపి ఎస్సీ మోర్చా అధ్యక్షులుగా శివానందపురం 15వ డివిజన్ నాయకులు పుట్టిక వెంకటరమణ నియమితులయ్యారు. ఈ మేరకు కడప బిజెపి కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు జంగిటి వెంకటసుబ్బారెడ్డి వెంకటరమణకు నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా పుటిక వెంకటరమణ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి, పార్టీ సిద్ధాంతాలకు, దళితుల సమస్యల కోసం పాటుపడతానని చెప్పారు. నాకు పదవి రావడానికి కారణమైన కడప జిల్లా బిజెపి జిల్లా అధ్యక్షులు జంగిటి వెంకట సుబ్బారెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు పనతల సురేష్,ఇందుకు సహకరించినటువంటి బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పీవీన్ మాధవ్, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి వంగళ శశిభూషణ్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్ రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు.

వార్త



# న్యూమోనియా, స్క్రబ్ టైపస్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం

**కె.వి పల్లి జనవరి 12 ప్రభాతవార్త:**

నియోజకవర్గంలోని వాల్మీకిపురం మండలంలో చింతపర్తి పిహెచ్సి పరిధిలో న్యూమోనియా వ్యాధి (ఊపిరితితులలో నెమ్ము )స్క్రబ్ టైపస్ వ్యాధులపై ప్రజలకు అవగాహన అవసరం అని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ అన్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలము లోని చింతపర్తి పీ. హెచ్. సి. పరిధిలోని విఠలము హరిజనవాడ లో డాక్టర్ జులేక బేగం ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ శ్రీమతి శ్వేత అధ్యక్షతన సాన్స్ కార్యక్రమంలో భాగంగా తల్లులకు, ప్రజలకు న్యూమోనియా వ్యాధి, స్క్రబ్ టైపస్ వ్యాధులు పై అవగాహన కల్పించారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లలలో జరుగుచున్న మరణాలకు ప్రధాన కారణం న్యూమోనియా అనీ ఈ వ్యాధి గురించి సమాజంలోని తల్లులందరికి అవగాహన కల్పించడానికి ప్రభుత్వం నవంబర్ 17 నుండి ఫిబ్రవరి 28వ తేదీ వరకు సాన్స్ (న్యూమోనియా ను విజయవంతంగా తటస్థికర్నిచడానికి సామాజిక అవగాహన మరియు చర్య )అనే కార్యక్రమం నిర్వహించడం జరుగుచున్నది. ఈ సాన్స్ కార్యక్రమం 2019సంవత్సరము నుండి నిర్వహించడం జరుగుచున్నది. న్యూమోనియా అనగా ఊపిరితిత్తులలో వచ్చే ఇన్ఫెక్షన్ దీనివల్ల గాలి చుట్లు వాపు కలిగి అందులో ద్రవం చేరడం జరుగుతుంది. ఇది ఒకటి లేక రెండు ఊపిరితిత్తులలో జరగవచ్చు. చిన్న పిల్లలలో న్యూమోనియా ప్రమాదకరం ప్రాణాపాయం కలిగించవచ్చు. కానీ సమాయానికి సరైన చికిత్స చేస్తే ప్రాణాన్ని కాపాడుకోవచ్చు.న్యూమోనియా లక్షణాలు జ్వరం, అతివేగంగా శ్వాస తీసుకోవడం, లేదా ఊపిరి ఆడటం లో ఇబ్బంది, ఆకలి లేక పోవడం, ఫీట్స్ కనిపించడం, వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలో ఉన్న ఆరోగ్య కేంద్రానికి తీసుకుని రావాలి.న్యూమోనియా ఉన్న పిల్లలకు ముందస్తు మొతాదు వ్యాక్సిన్ (ఆరు, పదనాలుగు వారాలలో మరియు బూస్టర్ డోస్ 9వ నెలలో) ఇస్తారు.స్క్రబ్ టైపస్ జ్వరాలు పొద పురుగు లేక పేడ పురుగు కాటు వేయడం వల్ల వాటి లోని బాక్టీరియా ఐన రికెట్సియా మన శరీరం లోకి చేరి ఆరు రోజుల తరువాత తీవ్ర జ్వరం, చలి, తలనొప్పి, మెడ దగ్గర షోషరస గ్రందుల వాపు, కళ్ల పసుపు రంగు లోకి మారడం, కాటు వేసిన చోట నల్లని మచ్చ ఏర్పడి శరీరం అంత ఎర్రటి దద్దులు వస్తాయి. నకడరాల నొప్పి, ఊపిరి తీసుకోవడం లో కష్టం మరియు చికిత్స తీసుకోవడం లో నిరక్ష్యం చేసిన యెడల గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీ, కాలేయం వంటి అవయవాలు పనిచేయడం లో విఫలం అయి ఒక్కోసారి చనిపోయే ప్రమాదం ఉంది. కావున వ్యవసాయం చేయువారు కాళ్లకు బూట్లు, చేతులకు గ్లోవ్స్ ధరించి వెళ్ళాలి. కావున స్క్రబ్ టైపస్ వ్యాధికి అవగాహన తో కూడిన అప్రమత్తం అవసరం ఎంతైనా ఉంది.. ఈ కార్యక్రమం లో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ,పర్యవేక్షకులు భానుబీ,సి. హెచ్.ఓ. రెడ్డెమ్మ, సీనియర్ ఏఎన్ఎమ్ నాగరత్న ఆశాకార్యకర్త శంకరమ్మ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

## బిఎస్ రావు జోనల్ లెవెల్ స్పోర్ట్స్ మీట్



**ప్రొద్దుటూరుఅర్బన్, జనవరి 12, ప్రభాతవార్త**

శ్రీచైతన్య విద్యా సంస్థల అధ్వర్యంలో డా. బి.ఎస్. రావు జోనల్ స్థాయి క్రీడా పోటీలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా డిఎస్పీ భావన, రూరల్ ఎస్పై రాజు, రాయలసీమ కాలేజ్ లెక్చరర్ డాక్టర్ రామసుబ్బారెడ్డి హజరై క్రీడాకారులను ఉత్సాహ పరిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి క్రీడలు ఎంతో అవసరమని తెలిపారు క్రీడల్లో పాల్గొనడం ద్వారా శారీరక ధృరుత్వం, క్రమశిక్షణ, జట్టు భావన పెరుగుతాయని పేర్కొన్నారు. ఈ జోనల్ స్పోర్ట్స్ మీట్ లో ప్రొద్దుటూరు 1,2,3,4,5, బద్వేల్, పులివెందుల, పోరుమామిళ్ళ, మరియు మైదుకూరు బ్రాంచీల విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటారు. పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎ.జి. ఎం. నాగిరెడ్డి, ప్రిన్సిపాల్స్, డీన్స్, ఇన్ చార్జెస్, పి.ఇ. టీలు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## గీతాంజలి క్రికెట్ ప్రీమియర్ లీగ్ విజేత టి. కమ్మపల్లె టీం



**రాజంపేట,జనవరి 12 ప్రభాతవార్త**

గతనెల రోజులుగా రాజంపేట మండలం వెంకట రాజంపేట లోజరుగుతున్న గీతాంజలి క్రికెట్ ప్రీమియర్ లీగ్ 4 పోటీలలో విజేతగా జె.వి.ఆర్. టీమ్ నిలిచింది. సోమవారం విజేతలకు బహుమతుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగారాజంపేట జనసేన పార్టీ పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ పాల్గొని గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్వీ రమణ తో కలిసి బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగాఅతికారి కృష్ణ మాట్లాడుతూ యువత క్రీడల వైపు ఆకర్షితులు అయితే ఆరోగ్యం తో పాటు క్రమశిక్షణ ,నాయకత్వ లక్షణాలు మెరుగవుతాయన్నారు. గ్రామస్థాయి నుంచి ప్రతిభావంతులు అయిన క్రీడాకారులు ముందుకు రావాలి అనే ఉద్దేశం తో ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్న ఎస్వీ రమణ, ఉషోదయ స్కూల్ కరస్పాండెంట్ సంభావ వినయ్ ను అభినందించారు. ఫైనల్ పోటీలు టీ.కమ్మపల్లి, బలిజపల్లి టీమ్, వెంకట రాజంపేట టీం మధ్య రసవత్తరంగా జరిగింది. విజేతలుగా పుల్లంపేట మండలం టీ. కమ్మపల్లి బలిజపల్లి జట్టు నిలిచింది. ఈ పోటీల విన్నర్ లకు 50000 రూపాయల నగదు పాటు క్రికెట్ కప్ ని అందజేశారు.రన్నర్స్ జట్టుకు 30,000 రూపాయల నగదు రన్నర్స్ ట్రోఫీ అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ లీగల్ సెల్ అధ్యక్షుడు తరిగోపుల లక్ష్మీనారాయణ, కడప జనసేన నేత రమణ, యువనేత కె ఎన్ నరసింహా , చల్లా సుధాకర్, అబ్బిగారి గోపాల్,తోట రామయ్య, వెంకటస్వామి, ఉద్దండంసుధాకర్, శివ, ప్రభాకర్, శ్రీను, తేజ, పాండు,చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## సంక్రాంతి సంతోషంగా జరుపుకోవాలి

### రాయచోటి సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ కృష్ణమోహన్

**రాయచోటి టౌన్ జనవరి 12 ప్రభాతవార్త**

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రజలు ఆనందోత్సాహాలతో, శాంతియుత వాతావరణంలో పండుగను జరుపుకోవాలని రాయచోటి సబ్ డివిజనల్ పోలీసు అధికారి కృష్ణ మోహన్ తెలిపారు. పండుగ సందర్భంగా శాంతి భద్రతలు, ట్రాఫిక్ నియంత్రణ, నేర నివారణ చర్యలపై ప్రత్యేక దృష్టి సారించి తగిన ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. ప్రజలు గాలిపటాలు ఎగురవేసేటప్పుడు నైలాన్ లేదా చైనా మాంజా వంటి ప్రమాదకర దారాలను వినియోగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇండ్ల ముందర ఆడవారు ముగ్గులు వేసే సమయంలో ద్విచక్ర వాహనదారులు సౌండ్ చేసుకుంటూ అసౌకర్యం కలిగించిన యెడల వారి పట్ల కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కోడిపందేలు, జూదము వంటి అసాంఘిక కార్యకలా పాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పండుగ కు ఊరు వెళ్ళే వారు జాగ్రత్తగా ఉండాలని కెమరాలు తప్పకుండా ఏర్పాటు చేసుకోవాలని విలువైన వస్తువులను ఇంట్లో పెట్టుకోవద్దని కోరారు. ప్రజలు ఏవైనా అత్యవసర పరిస్థితులు గమనించినట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా డయల్ 100 / 112 కు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రజల సహకారంతోనే పండుగను సురక్షి తంగా, సంతోషంగా జరుపుకోవాలని కోరారు. పోలీసు వారి నిభందనలు పాటించాలని, పోలీసులకు ప్రజలు సహకరించాలని రాయచోటి డిఎస్పి కృష్ణమోహన్ తెలిపారు.

## పారిశుధ్య కార్మికులకు చీరలు పంచలు పంపిణీ

**సుండుపల్లి, జనవరి 12, ప్రభాతవార్త :**

సంక్రాత్రి పండుగ పురస్కరించుకుని రాజంపేట నియోజవర్గ అబ్జర్వర్ చిట్టిబాబు, రాజంపేట అసెంబ్లీ ఇన్చార్జి జగన్మోహన్ రాజు ,రాష్ట్ర కార్యదర్శి చప్పిడి మహేష్ నాయుడు, మండల అధ్యక్షులు చప్పిడి రమేష్ నాయుడు పారిశుధ్య కార్మికులకు చీరలు, పంచలను పంపిణీ చేశారు. సంక్రాంతి పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు శివారెడ్డి, నాయకులు యూనియన్ భాష తదితరులు పాల్గొన్నారు.



## అంబరాన్ని అంటిన సంక్రాంతి సంబరాలు.



**రాయచోటి టౌన్ జనవరి12 ప్రభాతవార్త**

కులాలు, మతాలకు అతీతంగా పండుగను జరుపుకోవాలని జిల్లా ఎస్పీ శ్రీ ధీరజ్ కునుబిల్లి అన్నారు. ఈ సందర్భంగా రాయచోటిలోని పోలీస్ పరేడ్ మైదానంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ ధీరజ్ ఆయన సతీమణితో కలిసి ముఖ్య అతిథులుగా హాజరై భోగి మంటలు వెలిగించి వేడుకలను ఘనంగా ప్రారంభించారు. నిత్యం కవాతులు, శిక్షణలతో కనిపించే పోలీస్ మైదానం, సంక్రాంతి సందడితో ఒక్కసారిగా పల్లెటూరి వాతావరణాన్ని తలపించింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, సంక్రాంతి అనేది ఒక కులానికో, మతానికో పరిమితమైన పండుగ కాదని, ఇది శ్రమజీవులైన రైతుల పండుగ అని కొనియాడారు. కష్టపడి పండించిన పంట చేతికి వచ్చిన శుభవేళ, అందరూ కలిసి ఆనందాన్ని పంచుకునే గొప్ప సందర్భమన్నారు. వేడుకల్లో భాగంగా మహిళా పోలీసులు మరియు పోలీసు కుటుంబ సభ్యులు వేసిన రంగవల్లులు (ముగ్గులు) ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ముగ్గుల పోటీలను ఎస్పీ సతీమణి ఉమా శ్రీ లక్ష్మీ ప్రారంభించి, విజేతలను ఎంపిక చేశారు. మ్యూజికల్ చైర్స్, డ్రాయింగ్ పోటీలు, తంబోలా, గోలీలు, బొంగరాల వంటి ఆటలు నిర్వహించారు. ఎస్పీ దంపతులు స్వయంగా పిల్లలతో కలిసి గాలిపటాలు ఎగురవేసి, అందరిలో ఉత్సాహాన్ని నింపారు. కార్యక్రమం చివరలో వివిధ పోటీల్లో పాల్గొన్న సిబ్బందికి మరియు వారి పిల్లలకు ఎస్పీ దంపతులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు వి.జె.రామకృష్ణ, ఎం.పెద్దయ్య, ఇతర పోలీస్ అధికారులు, మహిళా పోలీసులు, హోంగార్డులు మరియు పోలీస్ కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీ సాయి విద్యానికేతన్ హై స్కూల్ విద్యార్థులు



**బద్వేలు అర్బన్ జనవరి 12 : ప్రభాతవార్త :**

జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని బద్వేల్ రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభ పాటవ పోటీలలో శ్రీ సాయి విద్యానికేతన్ హై స్కూల్ విద్యార్థులు మొదటి బహుమతి గురు ఉమామహేశ్వర్ పదవ తరగతి, తృతీయ బహుమతి మనోజ్ పదవ తరగతి, విద్యార్థులు సాధించడం జరిగింది వారికి పాఠశాల యాజమాన్యం నాగిరెడ్డి విజితా రెడ్డి, మానవతా అధ్యక్షులు నాగిరెడ్డి శంకర్ రెడ్డి మరియు ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు,విద్యార్థులు చదువులేనే కాకుండా అన్ని రంగాల్లో కూడా ముందుకు రాణించినప్పుడే పాఠశాలకు విద్య బోధన చేసినా గురువులకు మంచి పేరు వస్తుందని పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ విజితా రెడ్డి నాగిరెడ్డి శంకర్ రెడ్డి తో పాటు పలువురు అన్నారు, ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## యువతకు స్ఫూర్తిప్రదాత వివేకానందుడు

**వేంపల్లె జనవరి 12 (వార్త కాంక్ష)**



స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన స్వామి వివేకానందుడి విగ్రహాన్ని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్సీ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (బీటెక్ రవి) సోమవారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ, భారతీయ సంస్కృతిని మరియు సనాతన ధర్మ గొప్పతనాన్ని ప్రపంచ దేశాలకు చాటిచెప్పిన మహనీయుడు స్వామి వివేకానందుడని, ఆయన ఆశయాలు నేటి యువతకు నిత్య స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్వామి సుకృతానందజి బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి వంగల శశిభూషణం రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షులు వెంకటసుబ్బారెడ్డి, టిడిపి మండల పరిశీలికుడు రఘునాథరెడ్డి, టిడిపి మండల కన్వీనర్ సింగారెడ్డి రామ మునిరెడ్డి, బీజేపీ జిల్లా అధికారి ప్రతినిధి గాలి హరి ప్రసాద్, జనసేన పులివెందుల ఇంచార్జి హరీష్,జనసేన సీనియర్ నేత దాసరి శంకర్, జనసేన మండల యూత్ గోసల అంజి కూటమి నాయకులు,గౌస్ (ముండోడ్) పట్టణ అధ్యక్షుడు వేమకుమార్,కార్యకర్తలు, వివేకానంద సేవా సమితి సభ్యులు మరియు స్థానికస్వామీవివేకానంద స్కూల్ కరెస్పాండంట్ రామాంజనేయురెడ్డి, ఉపాధ్యాయులు, యువత పెద్ద ఎత్తున పాల్గొని వివేకానందుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## ఆంజనేయస్వామి ఆలయ చైర్మన్గా రమేష్

**రాజంపేట,జనవరి12 ప్రభాతవార్త**



అయంపేట పట్నం ప్రధాన రహదారిలో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయ కమిటీ చైర్మన్గా తలిశెట్టి రమేష్ ను నియమిస్తూ దేవాదాయ శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. రమేష్ తో పాటు మరో 13 మందిని సభ్యులుగా నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ తనకు ఆంజనేయ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ పదవి రావడానికి కృషి చేసిన టీడీపీ నియోజకవర్గ ఇంఛార్జ్ చమ్మర్తి జగన్ మోహన్ రాజుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే సీఎం చంద్రబాబు నాయుడుకు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు రమేష్ కృతజ్ఞతలు తెలిపారు.

## సాంప్రదాయం, సంస్కృతి ఉట్టిపడేలా ముగ్గుల పోటీలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్ పురం రామ్మూర్తి

**పీలేరు జనవరి 12 ప్రభాతవార్త:**

హిందూ సనాతన ధర్మాన్ని సాంప్రదాయ బద్ధమైన తెలుగువారి సంస్కృతిని ప్రతిభంభించేలా ముగ్గుల పోటీల విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులు అందించారు. పట్టణంలోని మార్కెట్ యార్డ్ ఆవరణలో పంచాయతీ కార్యదర్శి బ్రహ్మానంద రెడ్డి, వారి సిబ్బందితో సంక్రాంతి పండుగ సందర్భంగా విశిష్టత, పర్యావరణ పరిరక్షణపై చుక్కల ముగ్గులకు వివిధ రంగుల ముగ్గులు సందేశాత్మకంగా కళాత్మకంగా మహిళలు తీర్చిదిద్దారు. సంక్రాంతి పండుగ ముందే వచ్చిందా అనేలా ప్రాంగణమంతా ముగ్గులతో కలకలలాడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రైతు మార్కెట్ యార్డ్ అధ్యక్షులు పురం రామమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంక్రాంతి పండుగ పురస్కరించుకుని మన తెలుగువారి సాంప్రదాయం, సంస్కృతిని ఉట్టిపడేలా గ్రామీణ జీవనాన్ని ప్రతిబింబించే విధంగా మహిళలతో ముగ్గుల పోటీలు నిర్వహించామన్నారు. మహిళల సృజనాత్మకతకు ముగ్గుల పోటీలు మార్కెట్ యార్డ్ చక్కని వేదిక అని కొనియాడారు. ముగ్గుల పోటీలలో పాల్గొన్న మహిళలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ పూర్ణ, సాయి ప్రియ, కళావతి లను బహుమతులు అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి శ్రేణులు మహిళలు, పంచాయతీ, మార్కెట్ యార్డ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ఉద్యోగుల పెండింగ్ బకాయిల మంజూరుకు

## ఎన్జీవో సంఘం ప్రభుత్వంతో విస్తృత చర్చలు




**రాజంపేట, జనవరి 12 ప్రభాతవార్త**

ఉద్యోగులు పెండింగ్ బకాయిలు దశలవారీగా చెల్లించేందుకు ప్రభుత్వంతో ఏపీ ఎన్జీజీఓఖీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ చర్చలు జరుపుతున్నారని కడప జిల్లా అధ్యక్షులు బి శ్రీనివాసులు, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు యం వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ఐఆర్, పిఆర్సి, సరెండర్ లీవ్ లు,మొదలగు పెండింగ్ బకాయిలు వీలైనంత త్వరగా ఉద్యోగులకు అందేలా కృషి చేస్తున్నారని తెలిపారు. సోమవారం రాజంపేట ఎన్జీవో హోమ్లో రాజంపేట తాలూకా కార్యవర్గ సమావేశంలో అధ్యక్షులు యం.వరదయ్య అధ్యక్షతన జరిగింది. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిర్విరామంగా కృషి చేస్తున్నారని తెలిపారు. ఉద్యోగులు ప్రతి ఒక్కరు ఎన్జీవో సమాచారం మెంబర్గా చేరి, తమతో మిగతా ఉద్యోగులను కూడా సభ్యులుగా చేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్జీజీఓఖీస్ అసోసియేషన్ డైరీ, రాజంపేట తాలూకా, అన్నమయ్య జిల్లా క్యాలెండర్ ఆవిష్కరించి కార్యవర్గ సభ్యులుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా కార్యదర్శి నిత్యపూజయ్య, కోశాధికారి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు పద్మనాభరావు, అన్నమయ్య జిల్లా సహాధ్యక్షులు డివి శివారెడ్డి, ఉపాధ్యక్షులు పి మహాదేవ, సంయుక్త కార్యదర్శి సందీప్ కుమార్ రెడ్డి మరియు రాజంపేట తాలూకా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## పిజిఆర్ఎస్ అర్జీలకు సకాలంలో పరిష్కారం

### జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్రావు


అర్జీలు స్వీకరిస్తున్న డిఆర్ఓ

**మదనపల్లె, జనవరి 12 ప్రభాతవార్త :**

ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పిజిఆర్ఎస్)లో వచ్చే అర్జీలను సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్రావు తెలిపారు. సోమవారం అన్నమయ్య జిల్లా మదనపల్లె కేంద్రం కలెక్టరేట్లో నిర్వహించిన పిజిఆర్ఎస్లో జిల్లాలోని వివిధ మండలాల నుండి ప్రజలు వివిధ సమస్యలపై వచ్చిన అర్జీలను జిల్లా రెవెన్యూ అధికారి స్వీకరించారు. జిల్లా అధికారితో పాటు సబ్కలెక్టర్ చల్లాకళ్యాణి, సర్వేఏడి భరత్ కుమార్లు అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ అర్జీలకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. అర్జీలను త్వరగా పరిష్కరించేలా అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. పిజిఆర్ఎస్ అర్జీలకు ముఖ్యమంత్రి ఉన్నతాధికారులతో సమీక్ష చేస్తున్నారన్నారు. అర్జీదారులతో నేరుగా మాట్లాడి పెండింగ్ పనులను పూర్తి చేయడం జరుగుతుందన్నారు. డివిజన్, నియోజకవర్గ, మండలస్థాయి ప్రత్యేక అధికారులకు కేటాయించేలా మండలాలు, గ్రామాల్లో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలని పేర్కొన్నారు. సుమారు 266 అర్జీలను మధుసూదన్రావు స్వీకరించారు. జిల్లాలోని 25 మండలాల నుంచి వచ్చిన అర్జీదారులకు తాగునీరు, నీడ సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్వేఏడి భరత్కుమార్, ఆయాశాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ముందస్తు సంక్రాంతి సంబరాలు

**మదనపల్లి జనవరి 12 ప్రభాతవార్త**

చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఎంపీ ఆనందన్ ఆధ్వర్యంలో ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలను ఏర్పాటు చేసి పిల్లలకు భారతీయ సంస్కృతి సంప్రదాయాలను మరియు పల్లె వాతావరణాన్ని కళ్ళకు కట్టినట్టుగా చూపిస్తూ.. వారి ఆనందాల కేరింతల మధ్య సంబరాలు జరిపారు అనంతరం ముగ్గుల పోటీలు, పిల్లల తీపి పొంగల్, మరియు గంగిరెద్దుల అలంకారాలు, గాలిపటాలు ఎగరవేయడం, హరిదాసులు సోది చెప్పే వారి వేష ధారణలో పిల్లలు చూపరులను ఎంతో అలరించారు. ముగ్గుల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందిస్తూ ఆటపాటలతో పిల్లలతో మమేకమై బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్,ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, ఆనంద వృద్ధాశ్రమ వృద్ధులు, మరియు చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ సిబ్బంది పాల్గొన్నారు. అదే విధంగా 163వ వివేకానందుని జయంతిని ఘనంగా నిర్వహించారు. వివేకానంద జయంతిని జాతీయ యువజన దినోత్సవం కొనియాడుతూ నేటి యువతకు ఆయన ఎప్పుడు స్ఫూర్తిదాయకమని.. ఆయన అడుగుజాడల్లో అందరూ నడవాలని చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ జనరల్ సెక్రెటరీ కవితా రాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ అడ్మిన్ డైరెక్టర్ డాక్టర్ జీవి ఎస్ బాబు, కోశాధికారి పట్నం గిరిజమ్మల్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఏ కృష్ణ చరణ్, ఉపాధ్యాయుల బృందం జనార్ధన రెడ్డి ప్రసన్న సుప్రజా భార్గవి భారతి నేత్ర, లీ మార్షల్ అకాడమీ మురళి, సురేంద్ర వెంకటేష్, ఆనంద వృద్ధాశ్రమం వృద్దులు, చిన్నారులు పాల్గొన్నారు.



## మండెం లక్ష్మీనరసింహ స్వామికి పూజలు

**చిన్నమండె జనవరి 12 ప్రబాతవార్త:**



మండలంలోని దేవగుడిపల్లి గ్రామం జల్లావాండ్లపల్లి వద్ద మాండవ్య నది వడ్డున వెలసిన మహిమాన్వితుడు మండెం లక్ష్మీ నరసింహాస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీనరసింహస్వామి నక్షత్రం స్వాతి నక్షత్రం స్వామివారి నక్షత్రం సందర్భంగా స్వామికి అభిషేకం చేసి రంగురంగుల పుష్పాలతో అలంకరించారు.అర్చకులు స్వామికి నైవేద్యం సమర్పించి కొబ్బరికాయలు కొట్టి పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వాసులే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.

## మున్సిపల్ కార్మికులకు దుస్తులు పంపిణీ

### డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అభిమానుల సేవాభావం



**బద్వేలు అర్బన్ ,జనవరి 12 , ప్రభాతవార్త**

పట్టణంలో సంక్రాంతి పండగను పురస్కరించుకొని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అభిమానులు సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. బద్వేల్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ముంతల శ్రీనివాసులు, ముంతల శ్రీరాములు, కువైట్ నాగరాజు సహకారంతో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, బలిజ సంఘం అధ్యక్షుడు సింగంశెట్టి వెంకటసుబ్బయ్య, కొర్రపాటి సురేంద్ర, బలిజ సంఘం టిడిపి నాయకులు చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ, పట్టణ పరిశుభ్రత కోసం నిత్యం శ్రమించే మున్సిపల్ కార్మికులు సమాజానికి మూలస్తంభాలని, వారి సేవలు ప్రశంసనీయమన్నారు. పండగల వేళ ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కొంకుల రమణ, లకిడి విజయభాస్కర్, నాగార్జున, మస్తాన్ బాబు, బాల నరసింహులు, సింగంశెట్టి రమణ, చలపతి పండుకాయల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలను తక్షణం పరిష్కరించాలి : డిఎస్పీ



**మదనపల్లెక్రైమ్, జనవరి 12 ప్రభాతవార్త.**

ప్రజల నుంచి వచ్చే సమస్యలను పరిష్కరించాలని డి.ఎస్.పి మహేంద్ర తెలిపారు. సోమవారం మదనపల్లి ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో బాధితుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడారు. భూ వివాదాలు, కుటుంబ కలహాలు, సైబర్ నేరాలు, వేధింపులపై వచ్చిన అర్జీలను పరిశీలించారు. బాధితుల సమస్యలను విన్న వెంటనే, సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, క్షేత్రస్థాయిలో వాస్తవాలను విచారించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్జీదారులకు న్యాయం జరిగినట్లు నిర్ధారించుకోవడమే కాకుండా, తీసుకున్న చర్యలపై సమగ్ర నివేదికను ప్రధాన కార్యాలయానికి పంపాలని అధికారులకు సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ పడే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐలు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఈఈ ఎంటి పరీక్షల్లో రెండవ స్థానం

**పెద్దమండెం జనవరి 12 ప్రభాతవార్త**



రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఈఈఎంటి పరీక్షల్లో అన్నమయ్య జిల్లా రెండవ స్థానంలో కలిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థి రెండవ స్థానంలో నిలిచాడు. గత సంవత్సరం డిసెంబర్ 27న నిర్వహించిన పరీక్షల్లో కలుచర్ల ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థి జస్వంత్ రెడ్డి రెండవ స్థానాన్ని పొందడంతో వాళ్ళ తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. టైలర్ పని చేస్తూ కూరగాయల అమ్ముతూ పిల్లలను చదివించుకుంటున్న నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థి జిల్లా స్థాయిలో పరీక్షల్లో నెగ్గడం ఆనందంగా ఉందన్నారు. వీరికి జిల్లా స్థాయిలో మొదటి స్థానం పొందిన వారికి 12,000 రెండవ స్థానానికి 10000 మూడవ స్థానానికి 8000 ఇవ్వనున్నారు ఎండస్థానం పొందడంతో ఫిబ్రవరి 1వ తేదీన విజయవాడలో ఈ విద్యార్థికి పదివేల రూపాయలు ఈ ఈ ఎంపీ నిర్వాహకులు అందించడం జరుగుతుందని పాఠశాల హెచ్ఎం మీనా నాగలక్ష్మి తెలిపారు.

### భారతీయ సంస్కృతి సాంప్రదాయాల

## జ్ఞాన బండాగారం గ్రంథాలయాలు

### జిల్లా గ్రంథాలయ చైర్మన్ దాసరి భాను ప్రకాష్..

**కడప కార్పొరేషన్, జనవరి 12 ప్రభాతవార్త:**

కడప జిల్లా గ్రంథాలయ చైర్మన్గా దాసరి భాను ప్రకాష్ సోమవారం కొండాయిపల్లిలోనీ కడప జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ప్రమాణ స్వీకారం హట్టహాసంగా చేశారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ చైర్మన్ దాసరి భాను ప్రకాష్ విలేకరులతో మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సాంప్రదాయాల జ్ఞాన బండాగారం గ్రంథాలయాలు.. ప్రపంచానికి జ్ఞానాన్ని అందించే పుస్తక బండారం అంతటి గొప్ప కార్యమైన గ్రంథాలయానికి చైర్మన్ గా నియమించిన ముఖ్యమంత్రిచంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రిలు సత్యకుమార్, నారాలోకేష్, భారతీయ జనతా పార్టీ ఏపీ అధ్యక్షుడైన పివియన్.మాధవ్ ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, సహకరించిన కడప జిల్లా అధ్యక్షులు జంగిటి సుబ్బారెడ్డి, వంగల శశి భూషణ్ రెడ్డి లకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో మొత్తం 63 గ్రంథాలయాలు ఉన్నాయని ఒక్కొక్క గ్రంథాలయాన్ని స్వయంగా పరిశీలన చేసి అక్కడున్న లోటుపాట్లను సరిదిద్దాతానని చెప్పారు. సమస్యలను పరిష్కరిస్తామన్నారు. 6 మాసాలలో పురోగతికి ప్రయత్నిస్తానని తెలిపారు. గ్రంథాలయాలకు అభివృద్ధికి కేంద్రం సహకరిస్తుందన్నారు. దేశ ప్రధాని మోదీ 2047 వికసిక్ భారత్ లక్ష్యంలో భాగంగా ప్రజలందరినీ విద్య ,వైజ్ఞానిక, సమాచార కార్యక్రమాల ద్వారా సంకుటితం చేస్తామని ప్రజలందరిని చైతన్యవంతం చేసి భారత అభివృద్ధిలో భాగస్వామ్యం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వంగల శశి భూషణ్ రెడ్డ, బిజెపి జిల్లా అధ్యక్షులు జంగిటి వెంకటసుబ్బా రెడ్డి, నాయకులు బాలకృష్ణ యాదవ్, చలపతి, బొమ్మనావిజయ్, ప్రవీణ్, చాగలమర్రి ఓబులేష్, సుబ్బారెడ్డి, గౌతమ్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, మాజీ గ్రంథాలయ చైర్మన్ లు రామ్ కోటి రెడ్డి, రాంప్రసాద్ రెడ్డి, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

